ప్రజాశక్తి
సోమవారం 20 నవంబర్ 2023
8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

దయనీయ బతుకులు

- రెండో రోజూ కొనసాగిన బిఆర్‌టిఎస్ విస్తరణ పనులు
- రోడ్డున పడ్డ సింహాచలం, అడవివరం వాసులు
- నష్టపరిహారం చెల్లించకుండానే ఇళ్ల తొలగింపుపై మండిపాటు
- బాధితులకు అండగా సిపిఎం, టిడిపి

ఇళ్లను కూల్చివేయడంతో అడవివరం ప్రాథమిక పాఠశాల ఆవరణలోకి వచ్చిన బాధితులు

ప్రజాశక్తి - సింహాచలం

బిఆర్‌టిఎస్ రోడ్డు విస్తరణ పనులతో సింహాచలం, అడవివరం ప్రాంత ప్రజల బతుకులు దయనీయంగా మారాయి. తీవ్ర ఉద్రిక్తతల నడుమ శనివారం ప్రారంభమైన ఈ పనులు ఆదివారమూ కొనసాగాయి. జెసిబితో జివిఎంసి సిబ్బంది అప్పన్న తొలి పావంచా నుంచి అడవివరం వరకూ రోడ్డుకిరువైపులా ఉన్న నివాస గృహాలను కూల్చివేశారు. నష్టపరిహారం ఇవ్వకుండా, ఎటువంటి సమాచారమూ తెలియజేయకుండా ఉన్నఫళంగా వారు ఈ చర్యకు ఒడిగట్టడంతో బాధితులు కన్నీరుమున్నీరయ్యారు. తమ ఇళ్లలోని సామాన్లును సైతం తీసుకోనీయకుండా పనులు చేపట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడి పరిస్థితులను చూసిన వారు 'మరీ ఇంత దౌర్జన్యమా ?' అని అనడం కనిపించింది.

బాధితులను పరామర్శించిన సిపిఎం నాయకులు

ఇళ్ల తొలగింపుతో రోడ్డున పడ్డ బాధితులను సిపిఎం 72వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, గోపాలపట్నం జోన్ నాయకులు బి.వెంకటరావు తదితరులు పరామర్శించారు. బాధితులకు అండగా ఉండి పోరాటం నిర్వహిస్తామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా గంగారావు మాట్లాడుతూ బాధితులకు ఎటువంటి నష్టపరిహారమూ చెల్లించకుండా నిరంకుశంగా ఇళ్లను తొలగించడం దారుణమన్నారు. అధికారులు ఇటీవల నోటీసులు ఇచ్చి 15 రోజుల్లోగా అభ్యంతరం తెలియజేయాలని కోరారని, గడువు తీరక ముందే నాలుగు రోజుల్లోనే ఎటువంటి సమాచారమూ లేకుండా ఇలా దౌర్జన్యంగా మిగతా 2లో..

బాధిత ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సిపిఎం కార్పొరేటర్ గంగారావు

ఆర్‌కె బీచ్‌లో బిగ్ స్క్రీన్‌పై మ్యాచ్‌ను వీక్షిస్తున్న వేలాది మంది క్రీడాభిమానులు

అయ్యో..

వన్డే ప్రపంచ కప్ ఫైనల్‌లో భారత్ ఓటమితో నిరాశపడ్డ అభిమానులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వన్డే ప్రపంచకప్‌ను మూడోసారి భారత్ కైవశం చేసుకుంటుందన్న ఆశతో విశాఖపట్నం బీచ్ రోడ్డుకు వేలాదిగా తరలివచ్చిన అభిమానులకు నిరాశే మిగిలింది. వరుస విజయాలు సాధించి చివరకు ఫైనల్‌లో టీమిండియా ఓటమి పాలవడం సగటు అభిమానిని తీవ్రంగా కలిచివేసింది. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బీచ్‌రోడ్డులో ఫైనల్ మ్యాచ్ వీక్షణకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. భారీ స్క్రీన్లు అమర్చారు. ఫుడ్ కోర్టులు పెట్టారు. ఎసిఎ ఫ్యాన్ పార్క్ పేరిట తీరంలో ఘనంగా ఈ ఏర్పాట్లు సాగాయి. సుమారు 20 వేల మంది అభిమానులు అక్కడకు చేరుకుని ఉత్సాహంగా మ్యాచ్‌ను చూశారు. తొలుత భారత్ తక్కువ స్కోరు చేసినప్పటికీ ఆస్ట్రేలియా బ్యాటింగ్‌కు దిగి వెంటవెంటనే మూడు వికెట్లు కోల్పోవడంతో సందడి సందడి చేశారు. ఆ తరువాత ఆసీస్ క్రీడాకారులు పట్టుదలతో ఆడి మ్యాచ్‌ను లాగేసుకోవడంతో అభిమానులు నిరాశచెందారు. కొందరు కన్నీరుకార్చారు. దిగాలుగా ఇళ్లకు చేరారు.

ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణే యుటిఎఫ్ ధ్యేయం

▶ వార్త 4లో..

యథేచ్ఛగా గెడ్డల ఆక్రమణ

▶ వార్త 4లో..

27, 28 తేదీల్లో విజయవాడలో మహా ధర్నా

▶ వార్త 5లో..

వైర్‌లెస్ కాలనీనా ? ముడసర్లోవనా ?

రైల్వే జోన్ కార్యాలయ స్థలంపై తొలగని ప్రతిష్టంభన

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ప్రధాన కార్యాలయం ఏర్పాటుపై అటు వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక (డిపిఆర్)ను కేంద్రం ఆమోదించడంలో నాలుగేళ్లుగా తీవ్ర తాత్సారం చేస్తున్న సంగతి తెలిసిందే. మరోవైపు రైల్వే జోన్ కేంద్ర కార్యాలయానికి స్థల సమస్య కూడా వాల్తేరు రైల్వే ఉన్నతాధికారులను వెంటాడుతోంది. గతంలో రైల్వే అధికారులు బిఆర్‌టిఎస్ రోడ్డు కోసం జివిఎంసికి 15 ఎకరాలు ఇచ్చారు. దీనికి విలువ కట్టి 52 ఎకరాలను ముడసర్లోవలో రైల్వేకు ఇస్తామని చెప్పారు. కానీ 27 ఎకరాలకే పట్టా ఉంది. మిగతా భూమికి పట్టా జివిఎంసి ఇవ్వలేదు. ఈ స్థలాన్ని బాగు చేసుకుని రైల్వే జోన్ కోసం పనులు ప్రారంభించాల్సిన అవకాశం ఉన్నా అలా చేయలేదు. మిగతా ల్యాండ్ కోసం రైల్వే ఎదురు చూస్తూ ఉంది. అదే సందర్భంలో పట్టా ఉన్న 27 ఎకరాలకు సంబంధించి కూడా ఎంట్రీ ప్రదేశం లేదని రైల్వే వాదిస్తోంది. స్థానికులు కూడా రైల్వే సిబ్బందిపై కేసులు పెట్టి ఇబ్బంది పెడుతున్నారంటూ తాజాగా రైల్వే అధికారులు చెబుతున్నారు. 52 ఎకరాలు గనక వస్తే మంచి జోనల్ హెడ్‌క్వార్టర్ అవుతుందన్నది వీరు ప్రణాళికలు వేస్తున్నారు. రైల్వే జోన్ కార్యాలయ స్థలానికి లైన్ క్లియర్ అయితే ఈ ప్రాంత రూపు రేఖలు మారిపోతాయని పలువురు చెబుతున్నారు. జోన్ కార్యాలయంపై కేంద్రం చొరవ చేయడం లేదని, రాష్ట్ర ప్రభుత్వం కూడా జివిఎంసికి సరైన నిర్దేశం చేయడం లేదని రైల్వే అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా డిఆర్ఎం ఆఫీసు పక్కన వైర్‌లెస్ కాలనీలో సుమారు 15 ఎకరాల వరకూ స్థలం రైల్వేకు ఉంది. ఒకవేళ ముడసర్లోవ ప్రాజెక్టు సక్సెస్ కాకపోతే ఇక్కడే దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రధాన కార్యాలయ భవన సముదాయాన్ని నిర్మించాల్సి ఉంటుంది. ఎనిమిది అంతస్తుల మల్టీ స్టోరీడ్ భవంతుల నిర్మాణం కోసం రైల్వే బోర్డు యోచిస్తోంది. వాస్తవానికి ఈస్ట్ కోస్ట్ రైల్వేలో హెడ్‌క్వార్టర్ కార్యాయం రెండు అంతస్తులే వెడల్పుగా ఉంటుంది. వైర్‌లెస్ మిగతా 2లో..

పడిపోయిన భూగర్భ జల మట్టాలు

- తీవ్ర వర్షాభావ పరిస్థితులే కారణం
- చెరువుల అభివృద్ధి, సమర్థ సాగునీటి వినియోగంపై దృష్టి
- 'ప్రజాశక్తి'తో అనకాపల్లి జిల్లా భూగర్భ జల అధికారి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - అనకాపల్లి

'జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో భూగర్భ జల మట్టాలు గత ఏడాది కంటే పడిపోతున్నాయి. ఇప్పటికే పలు ప్రాంతాల్లో వర్షాలు లేక వరి పైర్లు ఎండిపోయాయి. ఇదే పరిస్థితి కొనసాగితే అందరికీ ఇబ్బందే' అని అనకాపల్లి జిల్లా భూగర్భ జల అధికారి శ్రీనివాసరావు అన్నారు. ఈ నేపథ్యంలో చెరువుల అభివృద్ధి, సమర్థవంతమైన సాగునీటి వినియోగంతో ముందుకు వెళ్తున్నట్టు చెప్పారు. జిల్లాలోని భూగర్భ జలాల పరిస్థితిపై ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

జిల్లాలో భూగర్భ జలాల పరిస్థితి ఎలా ఉంది ?

గత ఏడాది కంటే ఈసారి వర్షపాతం తక్కువగా నమోదైంది. జిల్లా సాధారణ వర్షపాతం 938.7 మిల్లీమీటర్లు కాగా 643.1 మిల్లీమీటర్లు నమోదు అయింది. 31.5 శాతం తగ్గింది.

మండలాల్లో నీటిమట్టాల పరిస్థితి ఏంటి ?

జిల్లాలో మూడు మీటర్ల లోతు నీటిమట్టం ఉన్న మండలాలు నర్సీపట్నం, చీడికాడ, ఎస్.రాయవరం. మూడు నుంచి ఎనిమిది మీటర్ల లోతు ఉన్న మండలాలు 15. వాటిపైన మరో ఆరు

మండలాలు ఉన్నాయి. చీడికాడ మండలం చీడికాడలో 0.44 మీటర్ల నీటిమట్టం ఉంటే

గరిష్టంగా దేవరాపల్లి మండలం తామరబ్బ గ్రామంలో 21.65 నమోదైంది.

ప్రస్తుతం భూగర్భ జల పరిశోధనలు ఎలా నడుస్తున్నాయి ?

ఈ ఏడాది ఏప్రిల్ నుంచి వివిధ ప్రభుత్వ సంస్థలు మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

దయనీయ బతుకులు

వ్యవహరించడం తగని పనని తెలిపారు. బుల్డోజర్లతో ఇళ్లను తొలగించడం దుర్మార్గమన్నారు. బాధితుల తరపున కలెక్టర్‌ను, జివిఎంసి కమిషనర్‌ను కలిసి అందాల్సిన నష్టపరిహారం, టిడిఆర్‌ల కోసం కృషి చేస్తామన్నారు. ఇంత జరిగినా ఇంతవరకూ స్థానిక ఎమ్మెల్యే కనిపించకుండా పోవడం శోచనీయమన్నారు.

టిడిపి నేతల పర్యటన

బాధితులను పరామర్శించేందుకు సంబంధిత ప్రాంతంలో టిడిపి నేతలు పర్యటించారు. మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, ఎమ్మెల్సీ చిరంజీవి రావు, విశాఖ జిల్లా అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు, కార్పొరేటర్లు పివి.నరసింహం, శంకరరావు, శ్రీనివాసరావు, మొల్లి లక్ష్మణరావు, పీలా శ్రీనివాసరావు, పార్టీ విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ కార్యదర్శి పాసర్ల ప్రసాద్ బాధితులను పరామర్శించిన వారిలో ఉన్నారు. రాష్ట్రంలో దుర్మార్గ పాలన కొనసాగుతోందని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన చేతగానితనం వల్లే ప్రజలను నష్టపరిచే విధంగా పనులు జరుగుతున్నాయని విమర్శించారు. బాధితులను ఆదుకునేందుకు తక్షణం ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు.

పడిపోయిన భూగర్భ జల మట్టాలు

ప్రతిపాదించిన వ్యవసాయ, బావుల నిర్మాణం కోసం 48 స్థలాల్లో సర్వేలు చేశాం. అన్నీ అనుకూలమైనవిగా ఉన్నాయి. తద్వారా ఈ ఏడాది 141 ఎకరాల వ్యవసాయ భూమి సాగులోకి వస్తుంది. 47 మంది రైతులు లబ్ధి పొందనున్నారు. అలాగే పరిశ్రమలకుగాను పరవాడ మండలంలో ఒకటి, కశింకోట మండలంలో ఒకటి భూగర్భ జల సర్వేలు నిర్వహించాం. ఈ మత్స్యకార్‌లో భాగంగా ఎనిమిది ప్రాంతాల్లో ఆక్వా కల్చర్ కోసం అనుమతులు మంజూరు చేశాం.

ప్రత్యేక అంశ ప్రణాళిక పథకం గురించి వివరించండి ?

ప్రత్యేక అంశ ప్రణాళిక పథకం కింద ఈ ఏడాది షెడ్యూల్డ్ కులాల వారికి నాలుగు బోరు బావులు, షెడ్యూల్ ట్రైబ్స్ వారికి మూడు వ్యవసాయ బోర్లు వేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నాం.

భూగర్భ జల గమన స్థితిగతుల లభ్యత, నాణ్యతల పరిశీలన ఎలా ఉంది ?

జిల్లాలో భూగర్భ జలాల లభ్యత, వినియోగంపై విశ్లేషణకు 23 పరిశీలక బావులను గుర్తించాం. జులై, నవంబర్, డిసెంబర్, జనవరి, మార్చి, మే నెలల్లో నీటి కొలతను సేకరించాలని భావించాం. నేషనల్ హైడ్రాలజీ ప్రాజెక్టు కింద జిల్లాలో వివిధ ప్రాంతాల్లో 81 ఫిజో మీటర్ల బావులను నిర్మించి వాటి నుంచి ప్రతినెలా నీటిమట్టాల గమన స్థితిగతులను విశ్లేషిస్తున్నాం. ఈ ఏడాది అక్టోబర్‌లో ఈ బోరు బావుల సరాసరి నీటిమట్టం 5.83 మీటర్లుగా నమోదైంది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 2.95 మీటర్ల నీటిమట్టం తగ్గింది. అయితే వీటి సరాసరి నీటిమట్టం 6.49 మీటర్లుగా మేలో నమోదైంది.

భూగర్భ జల మట్టాలు పెరిగేందుకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు ?

ఆంధ్రప్రదేశ్ సమీకృత సాగు నీరు, వ్యవసాయ పరివర్తన పథకం కింద చెరువులను అభివృద్ధి చేస్తున్నాం. అలాగే ఇరిగేషన్, భూగర్భ జలశాఖ, వ్యవసాయ, మత్స్యశాఖ, ఉద్యానవన శాఖల భాగస్వామ్యంతో సమర్ధవంతమైన సాగునీటి వినియోగం, ఆధునిక, వాతావరణ మార్పులను తట్టుకునే వ్యవసాయాన్ని ప్రోత్సహించడం కోసం కృషి చేస్తున్నాం.

వైర్‌లెస్ కాలనీనా ? ముడసర్లోవనా ?

కాలనీయే ఫైనల్ అయితే ఆ విధంగా రాదు. ముడసర్లోవలో కనీసం గతంలో జివిఎంసి చూపించిన 27 ఎకరాలను రైల్వేకు ఎలాంటి సమస్యా లేకుండా క్లియర్ చేస్తే అక్కడ ఆ తరహాగా జోన్ హెడ్‌క్వార్టర్స్‌ను నిర్మించుకోవచ్చు.

కొనసాగుతున్న ప్రతిష్టంభన

వాల్తేరు రైల్వే డివిజన్‌ను కేంద్రంలోని బిజెపి తొలగించిన తర్వాత రైళ్లు, లైన్లు ఏవీ కొత్తగా రావడం లేదు. మరోవైపు జోనల్ హెడ్‌క్వార్టర్స్ కార్యాలయానికి స్థలం ఎక్కడ అన్న అస్పష్టత కొనసాగుతూనే ఉంది. రైల్వే జోన్‌పై కేంద్రం నుంచి ఎనిమిదేళ్లుగా తీవ్ర ఆలస్యం జరుగుతోంది. పైగా మోసపు మాటలతో పబ్బం గడుపుకోడానికే బిజెపి నేతలు చూస్తున్నారు. గతంలో బీహార్‌లో ఇదే పార్టీ ఆఘమేఘాల మీద రైల్వే జోన్ ఏర్పాటు చేసింది. కేంద్రం నిర్లక్ష్యంతో ఉత్తరాంధ్ర ప్రగతి క్రమంగా అడుగంటిపోతోంది. డివిజన్‌తో కూడిన జోన్ ఉండాలన్న డిమాండ్ బిజెపి మినహా అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదికల నుంచీ వినిపిస్తున్న మాట. రైల్వే జోన్‌కు స్థల సమస్యనే పరిష్కరించలేని స్థితిలో ప్రభుత్వాలు ఉన్నాయి. అన్నీ ఉన్నా అక్కరకు రాని చందంగా రైల్వే జోన్ ఏర్పాటుకు కేంద్రం అదిగో ఇదిగో అంటూనే 2019 ఎన్నికలను దాటేసింది. 2024 ఎన్నికలూ సమీపిస్తున్నాయి. మళ్లీ ఇప్పుడు ఆ పార్టీ నేతలు రైల్వే జోన్ అంటూ హైరానా చేస్తున్నారు. వైర్‌లెస్ కాలనీనా ? ముడసర్లోవనా ? తేల్చాల్సింది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలేనని, ఆ విధంగా జివిఎంసి, రైల్వే మధ్య సయోధ్య కుదర్చాల్సి ఉందని వాల్తేరు రైల్వే అధికారులు, సిబ్బంది, ఉద్యోగులు ముక్తకంఠంతో చెబుతున్నారు.

ఉత్తమ ప్రాంతీయ కేంద్రంగా 'ఇగ్నో విశాఖ'

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) 38వ వ్యవస్థాపక దినోత్సవ వేళ ఆ వర్సిటీ విశాఖ ప్రాంతీయ కేంద్రానికి అరుదైన గౌరవం దక్కింది. జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రాంతీయ కేంద్రంగా విశాఖ ఎంపికైంది. 2023వ సంవత్సరానికి సంబంధించిన ఈ ఉత్తమ ప్రాంతీయ కేంద్ర అవార్డును న్యూ ఢిల్లీలో జరిగిన ఇగ్నో వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో బహూకరించారు. విశాఖపట్నం ప్రాంతీయ కేంద్ర సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వినియ్ కుమార్ సక్సేనా చేతులు మీదుగా ఈ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ధర్మారావు మాట్లాడుతూ ఈ అవార్డు అందరి సమిష్టి కృషి ఫలితంగా వచ్చిందన్నారు. విశాఖపట్నం ప్రాంతంలో 12 అధ్యయన కేంద్రాల ద్వారా వేల మందికి నాణ్యమైన ఉన్నత, నైపుణ్య విద్యను అందిస్తున్నట్టు తెలిపారు.

22న దళిత హక్కుల రక్షణపై రాష్ట్ర సదస్సు

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : 'రాజ్యాంగం కల్పించిన దళిత హక్కుల రక్షణ - సామాజిక న్యాయం'పై ఈ నెల 22న డాబాగార్డెన్స్‌లోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర స్థాయి సదస్సు జరుగనుందని నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు సదస్సు కరపత్రాన్ని ఆదివారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్‌పిఐ (ఎ) జాతీయ ఉపాధ్యక్షులు బొడ్డు కల్యాణరావు, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ఆధ్యక్షులు ప్రభాకరరావు, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఎం.సుబ్బన్న మాట్లాడారు. దేశంలో మనువాద బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులపై దాడులు పెరిగాయన్నారు. ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్లుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ఏర్పాటు చేసిన రాష్ట్ర సదస్సుకు వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు అధ్యక్షత వహిస్తారని తెలిపారు. డిఎస్ఎంఎం జాతీయ నాయకులు వి.శ్రీనివాసరావు, ఎఐఎడబ్ల్యుయు జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, సిడిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మల్లేపల్లి లక్ష్మయ్య, ఎఐడిఆర్ఎం జాతీయ అధ్యక్షులు ఎ.రామమూర్తి, రచయిత్రి గోగుల మండ అరుణ, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు తదితరులు హాజరు కానున్నట్టు తెలిపారు. కరపత్ర ఆవిష్కరణ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు వై.రాజు, ఎం.ఈశ్వం'రావు, ఎన్.ఎర్రిబాబు, కె.అప్పా రావు, సిహెచ్ రామారావు, జివిఎంసి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ముద్దాడ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విసిసి ఆటల పోటీల విజేతలకు బహుమతులు

బహుమతి అందుకుంటున్న విద్యార్థి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : చిల్డ్రన్స్ డే సందర్భంగా వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ (విసిసి) నిర్వహించిన వివిధ రకాల ఆటల పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి ఆదివారం బహుమతులు, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. పిఠాపురం కాలనీలో జరిగిన కార్యక్రమంలో విసిసి వ్యవస్థాపకులు డాక్టర్ కె.రమాప్రభ, ఆసరా ఎగ్జిక్యూటివ్ మెంబరు శ్రీనాథ్, పిఠాపురం కాలనీ అసోసియేషన్ కోశాధికారి రామకృష్ణ, డాక్టర్ శ్రీధర్, ఐద్వా నాయకులు కుమారి, ఆంధ్ర యూనివర్సిటీ స్కాలర్ ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెహ్రూ పిల్లల కోసం ఎంతగానో ఆలోచించారన్నారు. బాలల్లో శాస్త్రీయ దృక్పథం పెరగాలని, వారు ఆరోగ్యంగా ఎదగాలని ఆకాంక్షించారన్నారు. పిల్లలపై తల్లిదండ్రులు దృష్టి సారించి మంచి నడవడిక అలవర్చాలన్నారు. విసిసి చేస్తున్న కృషికి ఆసరా వంటి సంస్థలు అందిస్తున్న తోడ్పాటు మరవలేనిదన్నారు. కార్యక్రమంలో మణి, డి.నీలవేణి, గణేష్, నాగమణి, నందిని, గాయత్రీ, గణేష్, జయ ప్రసాద్, జయంత్ పాల్గొన్నారు.

37వ వార్డులో బెల్ట్ షాపులు తొలగించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ నగరంలో ఎక్కడా లేనివిధంగా 37వ వార్డు రైల్వే ప్రాంతంలో మద్యం బెల్టు షాపులు అధికంగా ఉన్నాయని, వాటిని తక్షణం నిర్మూలించాలని ఆ వార్డు వైసిపి కార్పొరేటర్ చెన్నా జానకిరామ్ కోరారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ బెల్టు షాపుల్లో కల్తీ మద్యం అధికంగా విక్రయిస్తున్నారన్నారు. మరోవైపు గంజాయి వంటి మత్తు పదార్థాలను విచ్చలవిడిగా అమ్మకాలు చేస్తున్నారని తెలిపారు. దీనివల్ల యువత, ముఖ్యంగా కార్మికులు వ్యసనాలకు బానిసవుతున్నారని ఆవేదన వెలుబుచ్చారు. వార్డులో ప్రభుత్వ మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేస్తుంటే బెల్టు షాపుల వారు అడ్డుపడుతున్నారని ఆరోపించారు. సమావేశంలో మత్స్యకార సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు పెంటయ్య మాస్టారు, చింతపల్లి అయ్యప్పరాజు, జయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'రంజిత్' వార్షికోత్సవం

మాట్లాడుతున్న ఎయు విసి ప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రియల్ ఎస్టేట్ రంగంలో స్థాపించిన అతి తక్కువ కాలంలోనే ఖాతాదారుల విశ్వాసాన్ని పొందిన రంజిత్ ప్రాపర్టీస్ అండ్ డెవలపర్స్ సంస్థ మూడో వార్షికోత్సవ వేడుకలు ఆదివారం సాయంత్రం నగరంలోని దసపల్లా హోటల్‌లో వైభవంగా జరిగాయి. ముఖ్య అతిథులుగా ఆంధ్రా విశ్వవిద్యాలయం ఉపకులపతి పివిజిడి.ప్రసాద్‌రెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షులు కోలా గురువులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ స్థాపించిన మూడేళ్లలో ఎనిమిది వెంచర్లు పూర్తి చేయటం ఎంతో గొప్ప విషయమని, ఇది కేవలం నాణ్యత, కచ్చితత్వం ఉంటేనే సాధ్యమని అన్నారు. రానున్న కాలంలో విశాఖ మరింతగా అభివృద్ధి చెందుతుందన్నారు. కోలా గురువులు మాట్లాడుతూ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ రాజధానిగా పేరుగాంచిన విశాఖలో రియల్ ఎస్టేట్ రంగం అంచెలంచెలుగా ఎదుగుతోందన్నారు. అనంతరం రంజిత్ ప్రాపర్టీస్ అండ్ డెవలపర్స్ భోగాపురం వద్ద 14 ఎకరాల్లో నిర్మిస్తున్న గేటెడ్ కమ్యూనిటీ 9వ వెంచర్ 'గీతా గోవిందం' బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రంజిత్ ప్రాపర్టీస్ అండ్ డెవలపర్స్ అధినేత అన్నేపు రంజిత్ కుమార్, వైసిపి నాయకులు గన్నమనేని వెంకటేశ్వర రావు (జివి), పేడాడ రమణి కుమారి, కళింగ కార్పొరేషన్ చైర్మన్ రవీంద్ర భారత్ పాల్గొన్నారు.

960వ రోజుకు ఉక్కు జెఎసి దీక్షలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సాగుతున్న రిలే దీక్షలు ఆదివారానికి 960వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను బేషరతుగా విరమించాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. లాభనష్టాలతో సంబంధం లేకుండా విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను వంద శాతం ప్రైవేటుపరం చేస్తామని పార్లమెంట్‌లోనే బిజెపి మంత్రులు ప్రకటన చేయడం దారుణమన్నారు. విశాఖలో ఆ పార్టీ ఎంపీ జివిఎల్ నరసింహారావు బూటకపు ప్రకటనలు చేయడాన్ని ప్రజలంతా గుర్తిస్తున్నారన్నారు. దీక్షల్లో నాయకులు జి.వామనమూర్తి, కోటా సత్తిబాబు, జె.రామకృష్ణ, కాసారపు సత్య నారాయణ, కొండపు ఈశ్వరరావు, లంకా గోవిందు, కె.శివ, ఎస్.రమేష్ పాల్గొన్నారు.

మహిళల్లో గుంటూరు.. పురుషుల్లో విశాఖ

బాస్కెట్ బాల్ ఛాంపియన్‌షిప్‌లో విజయకేతనం

ప్రజాశక్తి - ఎఎన్‌యు (గుంటూరు జిల్లా) ఆంధ్రప్రదేశ్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లాలోని ఆచార్య నాగార్జున యూనివర్శిటిలో మూడ్రోజులుగా నిర్వహిస్తున్న 1వ ఆంధ్రప్రదేశ్ స్టేట్ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ బాస్కెట్ బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ముగిశాయి. మహిళల విభాగంలో గుంటూరు జిల్లా జట్టు విజేతగా నిలిచింది. ఆదివారం సాయంత్రం హోరాహోరీగా జరిగిన ఫైనల్స్‌లో విశాఖ జిల్లా జట్టుపై 40-31 పాయింట్లతో గుంటూరు జిల్లా జట్టు జయకేతనం ఎగురవేసింది. ఉదయం జరిగిన మహిళల సెమీఫైనల్స్‌లో గుంటూరు జిల్లా జట్టు తూర్పుగోదావరి పైనా విశాఖ జిల్లా జట్టు కడప జిల్లా జట్టుపై విజయం సాధించి ఫైనల్స్‌కు చేరుకున్నాయి. పురుషుల విభాగంలో సెమీఫైనల్స్‌లో ఏలూరు జిల్లాజట్టుపైన విశాఖ జిల్లా జట్టు గెలుపొందగా అనకాపల్లి జట్టుపై నంద్యాల జిల్లా జట్టు విజయం సాధించి ఫైనల్స్‌కు చేరాయి. విశాఖ, నంద్యాల జిల్లా జట్ల మధ్య హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో 59-55 పాయింట్లతో విశాఖ జిల్లా జట్టు విజేతగా నిలిచింది. అనంతరం విజేత జట్లకు బహుమతులు ప్రదానం చేశారు.

ఎండిన వరి

వెన్ను వంచి ఎండిపోతున్న వరి పంట

ఆందోళనలో అన్నదాతలు

ప్రజాశక్తి -ఆనందపురం : సకాలంలో వర్షాలు లేక ఈ ఏడాది వరి పంట ఎండిపోతోంది. పొట్ట దశలో ఎండిన వరి పంటను చూస్తూ రైతులు ఆందోళన చెందుతున్నారు. కురిసిన కొద్దిపాటి వర్షాలకు రైతులు నాట్లు వేసి అధిక పెట్టుబడులు పెట్టారు. సకాలంలో వర్షాలు లేక చెరువుల ఎండిపోయి పొట్ట దశలో నీరు లేక వరి కంకులు పశువులు మేతకు కూడా పనికిరాకుండా పోయాయి. ఈ విషయాన్ని రైతులు రైతుభరోసా కేంద్రం సిబ్బంది దృష్టికి తీసుకెళ్తే నష్టపరిహారం రాదంటూ చెప్పడంతో అయోమయంలో పడ్డారు.

ఆనందపురం మండలం చందక పంచాయతీ పరిధిలోని సుమారు 30 మంది రైతులు 30 ఎకరాలలో వరి నాట్లు వేశారు. వర్షపు నీటితో పాటు దొంతలవానిచెరువు, చిన్న నవిటబంధ, నాయుడు ట్యాంక్, అయివాని చెరువులు ఆధారంగా వరి పంటలు వేశారు. వర్షాలు పడితే చెరువులు నిండి పంటలకు నీరు అందేది. ఈ ఏడాది సకాలంలో వర్షాలు పడకపోవడంతో చెరువులు ఎండిపోయి పొట్ట దశలోనే నీరు లేక గింజ కట్టలేదు. దీంతో ఆందోళన చెందిన రైతులు నష్టపరిహారం ఏమైనా వస్తుందేమోనని ఆశ పడి రైతు భరోసా కేంద్రం సిబ్బంది దృష్టికి తీసుకెళ్లారు. వారు నష్ట పరిహారం రాదని చెప్పడంతో రైతులు లోలుగు పెంటయ్య, దొంతల కృష్ణ, లోలుగు కృష్ణ, లోలుగు రాజు, దొంతల నాగరాజు, గుసిడి అబద్దం తదితర రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. వర్షాభావ పరిస్థితుల్లో పంటలు ఎండిపోతే ఆదుకోవాల్సిన ప్రభుత్వ అధికారులు పరిహారం రాదని తెగేసి చెబుతున్నారని, అప్పులు చేసి పంటలు పండించినా కనీసం పెట్టుబడి రావటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వ్యవసాయ అధికారులు పరిశీలించి రైతులను ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

అప్పుచేసి పెట్టుబడి పెట్టాను

చెరువు కింద ఎకరా పొలంలో వరి నాట్లు వేశాను. రూ.18వేలు అప్పు చేసి పెట్టుబడి పెట్టాను. నీరు లేక డీజిల్ మోటార్లు పెట్టి పంటకు తడి పెట్టాను. ఖర్చు అధికమై పంట ఎండిపోవడంతో దిక్కు తోచడంలేదు.

లోలుగు కృష్ణ, రైతు

మద్దతు ధర సరే...

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏవీ?

ఎకరాకు సరాసరి 25 బస్తాల దిగుబడి

పౌరసరఫరాల శాఖ అధికారులు స్పందించకుంటే మిల్లర్లకే లబ్ధి ?

ప్రజాశక్తి -భీమునిపట్నం

ఓ వైపు వరి కోతలు మొదలయ్యాయి. బోర్లు ఉన్న చోట వరి పంట సాగైంది. భీమిలి మండలంలో 1307 ఎకరాల్లో, ఆనందపురం మండలంలో 1520 ఎకరాల్లో, పద్మనాభం మండలంలో 6,605 ఎకరాల్లో వరి పంట సాగైంది. ఈ సాగంతా వ్యవసాయ బోర్లు, పంపు సెట్లు, నీటి వసతి ఉన్న చోటే జరిగింది. మరో వైపు ఇప్పటికే కొన్ని గ్రామాల్లో వరి పంట కోతలు ఆరంభమయ్యాయి. ఇంటికి చేరిన ధాన్యం మెరుగైన ధరకు అమ్ముకోవాలని రైతులు ఆలోచిస్తున్నారు.

ధాన్యం క్వింటాలు (వంద కిలోలు) 1121 రకం గ్రేడ్ ఏ ధర రూ.2,203గా ప్రకటించగా, ముతక ధాన్యం రూ.2,183గా ప్రకటించారు. ఉదాహరణకు ఎకరాకు 25 బస్తాలు దిగుబడి వస్తే గనుక ప్రభుత్వ మద్దతు ధర ప్రకారం రూ.55 వేలు వస్తుంది. ఎకరాకు రైతుకు రూ.25 వేలు పెట్టుబడి అయింది. పెట్టిన పెట్టుబడి పోను రూ.30నుంచి వేల వరకు లాభం వస్తుంది. ఇదంతా ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా జరిగితేనే వచ్చే అవకాశముంది.

ప్రకటనలకే పరిమితం...

రైతు భరోసా కేంద్రాలు కేంద్రంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్న ప్రభుత్వం ఇప్పటి వరకూ భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల పరిధిలో ఎక్కడా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయలేదు. ఈ కేంద్రాలను పౌరసరఫరాల విభాగం ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇంత వరకూ అటువంటి ప్రయత్నాలే మొదలు కాలేదని పలువురు రైతులు చెబుతున్నారు.

కేంద్రాల ఏర్పాటులో జాప్యంతో మిల్లర్లకు లాభం!

ఇప్పటికే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉండగా, ఇంకా జాప్యం జరిగితే రైతులు తప్పని సరి పరిస్థితుల్లో మిల్లర్లను ఆశ్రయించక తప్పదు. దళారీల జోక్యం పెరుగుతుంది. వారంతా సిండికేట్‌గా ఏర్పడినా ఆశ్చర్యం లేదు. మిల్లర్ల గనుక కొంటే బస్తా గ్రేడ్ ఏ రకం రూ.1475, ముతక రకానికి రూ.1450 ఇస్తున్నారని పలువురు రైతులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వీలైనంత త్వరగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు.

గతేడాది 7 చోట్ల కేంద్రాలు

గతేడాది డివిజన్‌లో 7 చోట్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేశారు. పద్మనాభం మండలంలో కృష్ణాపురం, పాండ్రంగి, బాందేవపురం, గంధవరం, పొట్నూరు, ఆనందపురం మండలం బోని, భీమిలి మండలం తాటితూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేశారు.

ఓటరు నమోదుకు విశేష స్పందన

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 11వ వార్డులో టిడిపి, జనసేన సంయుక్త ఆధ్వర్యాన ఆదివారం నిర్వహించిన ఓటరు నమోదు కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ముగడ రాజారావు ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు హాజరయ్యారు. అర్హులైన సుమారు 380 మంది కొత్తగా ఓటు నమోదు చేసుకున్నారు. 120 మంది మార్పులు, చేర్పులకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు ఒమ్మి అప్పలరాజు, గాడి సత్యం, మూడి అప్పారావు, ఏడువాక సన్యాసిరావు, పల్లా నాని తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించిన ప్రముఖులు

ప్రజాశక్తి-సింహాచలం: సింహాద్రి అప్పన్నను ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఢిల్లీ హైకోర్టు న్యాయవాది దినేష్ కుమార్ శర్మ, భీమిలి ఆర్‌డిఒ భాస్కర్‌రెడ్డి వేర్వేరుగా దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఇఒ సింగాల శ్రీనివాసమూర్తి సాదరంగా స్వాగతం పలికారు. వీరు ముందుగా కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. బేడా మండపం చుట్టూ ప్రదక్షిణ చేశారు. స్వామి అంతరాలయంలోనూ, గోదాదేవి సన్నిధిలోనూ, గోత్రనామాలతో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆస్థాన మండపంలో అర్చకులు ఆశీర్వదించారు. వారికి ఆలయ అధికారులు స్వామివారి ప్రసాదాన్ని అందించారు.

గీతం ఆర్కిటెక్చర్ స్కూల్ వర్క్ షాప్

ప్రజాశక్తి -మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ ఆధ్వర్యాన విశాఖ ఆర్‌కె బీచ్ కాళీమాత ఆలయం సమీపంలో ఆదివారం చార్కోల్ వర్క్ షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ అధ్యాపకులు బొగ్గుతో అందమైన చిత్రాలను ఏ విధంగా గీయవచ్చో శిక్షణ ఇచ్చారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి యువతీ యువకులు, విద్యార్థులు హాజరయ్యారు. ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్న వారికి ఉచితంగా చిత్రకళా సామగ్రిని అందజేశారు. ఆర్కిటెక్చర్ విద్యపై అవగాహన కలిగించడంతో పాటు బొగ్గు ముక్కలతో కూడా అందమైన చిత్ర రచన ఏ విధంగా చేయవచ్చో ఔత్సాహికులను ప్రోత్సహించడం కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమని గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ డైరక్టర్ డాక్టర్ విభూతి సచ్చదేవ్ తెలిపారు.

నేరాలు ఘోరాలు

సైబర్ కేటుగాళ్ల చేతివాటం

- బ్యాంకు ఖాతాల్లో నగదు మాయం

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం ప్రాంతంలో సైబర్ నేరాలు జోరుగా జరుగుతున్నాయి. ఖాతాదారులకు తెలియకుండానే వారి బ్యాంకు అకౌంట్‌లోని నగదు మాయం అవుతుండడంతో లబోదిబోమంటున్నారు. సైబర్‌కేటుగాళ్ల మోసాల బారిన పడి, న్యాయం కోసం పోలీస్ స్టేషన్ చుట్టూ తిరుగుతున్నారు. స్మార్ట్‌ఫోన్లపై అవగాహన లేని, వాటిని వాడనిరైతులు, వ్యవసాయ కూలీలు ఎక్కువగా మోసపోతున్నారు. కేటుగాళ్ల డ్రాచేసిన మెసేజ్‌లు వచ్చినా పరిశీలించే పరిస్థితిలేకపోవడంతో, అవసరాల కోసం డబ్బులు తీసుకుందామని బ్యాంక్‌కు వెళితే అకౌంట్‌లో డబ్బులు లేకపోయే సరికి ఆవేదన చెందుతున్నారు.

చోడవరం స్టేట్ బ్యాంక్, వడ్డాది ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, స్టేట్ బ్యాంకుల్లో ఇటీవల అనేకమంది ఖాతాల నుంచి ఇలాగే వారికి తెలియకుండానే డబ్బులు డ్రా అయిన విషయం వెలుగులోకి వచ్చింది. బుచ్చయ్యపేట మండలం కుమందానిపేట గ్రామానికి చెందిన దాడి సత్యనారాయణ అనే పాడి రైతు పాల పేమెంట్ డబ్బులు రూ. 37వేలను ఈనెల నవంబరు మొదటి వారంలో నాలుగు విడతలుగా డ్రా చేసారు. వడ్డాది గ్రామానికి చెందిన ప్రముఖ టిడిపి నేత రెండు బ్యాంకు అకౌంట్ల నుంచి చెరో రూ.పదివేలు ఇలాగే మాయం కావడంతో అకౌంట్లను క్లోజ్ చేసేశాడు.. చోడవరం స్టేట్ బ్యాంకులో పి సత్యనారాయణ అకౌంట్ నుంచి రూ. పదివేలు పోవడంతో పోలీసులకు, బ్యాంక్ అధికారులకు ఫిర్యాదు చేయగా, అతడి డబ్బులు వారం రోజుల తర్వాత తిరిగి అకౌంట్లోకి వచ్చాయి.

దీనిపై చోడవరం సీఐ శ్రీనివాసరావు స్పందిస్తూ, బ్యాంకు అకౌంట్లను నగదు మాయంపై ఫిర్యాదులు అందాయని, వాటిపై బ్యాంకులకు వెళ్లి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఎక్కడపడితే అక్కడ డిజిటల్ వేలిముద్రలు వేయడం వల్ల సైబర్ మోసగాళ్లకు సమాచారం అంది, ఇలా మోసపోయే పరిస్థితి వస్తుందని బ్యాంక్ అధికారులు హెచ్చరిస్తున్నారు. కష్టపడి సంపాదించి, బ్యాంకు ఖాతాల్లో ఉంచుకున్న సొమ్ము ఇలా మాయమౌతుంటే ఎలాగని పలువురు ఆవేదన చెందుతున్నారు.

సహకార సంఘాల ద్వారా రుణాలు

ప్రజాశక్తి -ఆనందపురం : రైతు సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన సహకార సంఘాల ద్వారా అన్ని రకాల రుణాలు అందించినట్లు వేములవలస సహకార సంఘం చైర్మన్ ఎం.రామసత్యం పేర్కొన్నారు. వేములవలస సహకార సంఘం ఆధ్వర్యాన వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సహకార సంఘాల ద్వారా రైతులకు, ఎస్‌టిలకు, జాయింట్ లయబులిటీ గ్రూప్ సభ్యులకు రుణాలు, బంగారంపై రుణం ఇస్తున్నట్లు చెప్పారు. సేవింగ్ ఖాతాలు, ప్రమాదపు బీమా సౌకర్యం కల్పించి రైతుల అభివృద్ధే ధ్యేయంగా నడుస్తున్న సహకార సంఘాలను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మధురవాడ బ్రాంచ్ మేనేజర్ మురళి, సూపర్‌వైజర్ వేణు, సంఘ కార్యదర్శి బి.దశావతారం పాల్గొన్నారు.

రహదారుల గుంతలపై టిడిపి, జనసేన నిరసనలు

ప్రజాశక్తి-యంత్రాంగం

రహదారులు గుంతలమయం కావడంపై విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో పలుచోట్ల టిడిపి, జనసేన ఆధ్వర్యాన నిరసనలు తెలిపారు.

గాజువాక : చినగంట్యాడ జగ్గు జంక్షన్ ప్రధాన రహదారిపై గోతుల్లో మొక్కలు నాటి టిడిపి, జనసేన నాయకులు వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విశాఖ పార్లమెంటరీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, జనసేన పిఎసి సభ్యులు కోన తాతారావు మాట్లాడుతూ, రహదారుల నిర్వహణలో ఈ ప్రభుత్వం విఫలం చెందిందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు ప్రసాదుల శ్రీనివాస్, గడసల అప్పారావు, తిప్పల రమణారెడ్డి, గంధం శ్రీనివాసరావు, దల్లి గోవిందరెడ్డి, గంధం వెంకటరావు, మహమ్మద్ రఫీ, సర్వసిద్ధ అనంత లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మధురవాడ : జివిఎంసి 5వ వార్డు పరిధి మారికవలస నుంచి కాపులుప్పాడ వెళ్లే రహదారిలో టిడిపి, జనసేన ఆధ్వర్యాన 'గుంతల ఆంధ్రప్రదేశ్‌కు దారేది' పేరుతో ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా భీమిలి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు, జనసేన నాయకుడు బివి.కృష్ణయ్య మాట్లాడుతూ, గుంతల రహదారులతో రాష్ట్ర ప్రజలు పడుతున్న

రోడ్డు గుంతలో మొక్కలు నాటి నిరసన తెలుపుతున్న నాయకులు

అవస్థలు ముఖ్యమంత్రికి కనిపించడంలేదా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన నాయకులు మొల్లి లక్ష్మణరావు, నమ్మి శ్రీను, నాగోతి శివాజీ, దాసరి శ్రీనివాసరావు, గరే గురునాథ్, దొరబాబు, శాఖరి శ్రీనుబాబు, నాగోతి నరసింహనాయుడు, దేవర శివ, శ్రీకాంత్‌రెడ్డి, తమ్మిన అప్పలరాజు, పీకేటి శ్రీను, జగుపల్లి నాని, ఆకుల శివ,తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి: పినగాడి జంక్షన్ నుంచి వేపగుంట వెళ్లే రహదారిలో టిడిపి, జనసేన నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ ఇన్‌ఛార్జి పంచకర్ల రమేష్‌బాబు మాట్లాడుతూ, రోడ్ల దుస్థితిపై జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం మొద్దు నిద్ర విడనాడాలని కోరారు. మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ, వేపగుంట నుంచి పినగాడి రోడ్డుకు శంకుస్థాపన చేసి కూడా పనులు ప్రారంభించలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఇరు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కశింకోట : రహదారుల్లోని గుంతలను నెలరోజుల్లో పూడ్చకుంటే మంత్రి అమర్‌ను రోడ్లపై తిరగనివ్వబోమని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ , నియోజకవర్గ జనసేన ఇంచార్జీ పరుచూరి భాస్కరరావు హెచ్చరించారు. తాళ్లపలసలో గుంతలతో నిండి, అధ్వానంగా ఉన్న నర్సీపట్నం రోడ్డులో టిడిపి, జనసేన నేతలు బైఠాయించి నిరసన చేపట్టారు. రోడ్లపై గుంతలు పుడ్చకపోతే టీడీపీ- జనసేన శ్రేణులు భిక్షాటన చేసి మరమ్మత్తులు చేస్తామన్నారు. 30రోజులలో రోడ్లను మరమ్మత్తులు చేయకపోతే మంత్రి గుడివాడ అమర్నాథ్ ను రోడ్లపై తిరగనివ్వబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు కోట్ని బాలాజీ, కాయల మురళి ఉగ్గిని రమణ మూర్తి, పావడా కామరాజు పాల్గొన్నారు.

ప్రేక్షకుల మదిలో చెరగని నటుడు చంద్రమోహన్

ప్రజాశక్తి-సీతమ్మధార : తెలుగు ప్రేక్షకుల మదిలో చెరగని ముద్ర వేసిన నటుడు చంద్రమోహన్ అని వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు పేర్కొన్నారు. పౌర గ్రంథాలయం సౌజన్యంతో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యాన విశాఖ పౌర గ్రంథాలయంలో ఇటీవల మరణించిన నటుడు చంద్రమోహన్ సంస్మరణ సభ నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి చంద్రమోహన్ చిన్నాన్న కుమార్తె నగర నివాసి నాగరాజ కుమారి, సూర్యారావు, నరవ ప్రకాశరావు తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నరవ ప్రకాశరావు మాట్లాడుతూ, చంద్రమోహన్ 900కుపైగా చిత్రాల్లో తన సహజ నటనతో నవరసాలు పండించారన్నారు. ఆయన పేరున ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహించే ఆలోచన ఉందన్నారు. ఈ సందర్భంగా చంద్ర మోహన్‌కు కీర్తిని తెచ్చిపెట్టిన సీతా మహాలక్ష్మి తెలుగు సినిమాను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో హుస్సేన్, ఘాట్ల బాబూరావురెడ్డి, డాక్టర్ బబ్జీ, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

'బాబు ష్యూరిటీ'పై ప్రచారం

ప్రజాశక్తి -గాజువాక, కశింకోట : జివిఎంసి 75వ వార్డు పరిధి నెల్లిముక్కు గ్రామంలో 'బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారంటీ' కార్యక్రమాన్ని ఆదివారం టిడిపి నాయకులు పులి రమణారెడ్డి ప్రారంభించారు. వార్డు తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమం నెల్లిముక్కు, చినకొరాడ, సీతానగరం, సిద్దేశ్వరం, దుర్గవానిపాలెం మీదుగా పెద గంట్యాడ సెంటర్ వరకు సాగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి మాట్లాడుతూ, బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారంటీ పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు టిడిపి అధ్యక్షులు నమ్మి అప్పారావు, కార్యదర్శి దొమ్మేటి పెరుమాళ్, నాయకులు మొల్లి పెంటిరాజు, శ్రీమసిరి శ్రీనివాసరావు, ములకలపల్లి పెంటయ్య, పెద్దాడ సోము నాయుడు, కణితి సన్యాసమ్మ, బొంగు రాజు, నాయుడు, మొల్లి అక్బర్, కాకినాడ అప్పలరాజు, పులి పోలిరెడ్డి, పులి పెరుమాళ్‌రెడ్డి పాల్గొన్నారు.

కశింకోట :మండలంలోని తాళ్లపాలెం, చింతలపాలెం గ్రామాల్లో బాబు ష్యూరిటీ, భవిష్యత్ గ్యారెంటీ ప్రచారం, నమోదు కార్యక్రమాన్ని తాళ్లపాలెం టిడిపి అధ్యక్షుడు ఉల్లింగల రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి, టిడిపి జనసేన ఉమ్మడి మెనిఫెస్టోలోని పథకాలను ప్రజలకు వివరించడంతోపాటు ప్రభుత్వ వైఫల్యాలనుఎండగట్టారు. కార్యక్రమంలో అచ్చర్ల టిడిపి అధ్యక్షులు నైనంశెట్టి రమణారావు, మాజీ సర్పంచ్ కర్రి దుర్గనాయుడు, జెర్రిపోతుల నూకు నాయుడు, కోన రమణ, త్ కన్వీనర్ బుద్దిరెడ్డి వీరునాయుడు, గొంతిన నూకరాజు, తెరపల్లి శ్రీను, బుద్దిరెడ్డి బాబురావు, నక్క సాయి, వెంకట్, వీరునాయుడు, ఆంధ్ర శ్రీను, నిమ్మదల శీను పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

ప్రజాశక్తి -పద్మనాభం : కార్తీక మాసాన్ని పురస్కరించుకుని త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యాన పద్మనాభం మండలంలోని బిఆర్.తాళ్లవలస, బొత్సపేట గ్రామాల్లో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం చేశారు. కార్యక్రమంలో కె.త్రినాథరావు, జి.కృష్ణ సూరప్పుడు, బి.అప్పలనాయుడు, కె.రాజు, కె.లక్ష్మి, జి.భారతి పాల్గొన్నారు.

అమ్మ వాసవి సేవా ట్రస్టు ఏర్పాటు

ప్రజాశక్తి -గాజువాక : శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో 102 మంది వాసవి సభ్యులచే అమ్మ వాసవి సేవా ట్రస్టును ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ఫౌండర్ కారుమూరు మహేష్ మాట్లాడుతూ, ట్రస్టు ద్వారా పేదలకు సేవా కార్యక్రమాలు అందిస్తామన్నారు. కాలం చేసిన ఆర్యవైశ్యులకు అంతిమయాత్ర వ్యాను, అవసరమైన వారికి ఫ్రీజర్ బాక్స్, 50 నుంచి 100 వరకు వాటర్ బాటిళ్లు ఉచితంగా పంపిణీ చేస్తామని చెప్పారు. ఉచిత వైద్యశిబిరాలు, ఉపాధి అవకాశాలు వంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పూడ వరహాలశెట్టి, శ్రీరాములు, గునిశెట్టి అప్పల సత్యనారాయణ గుప్తా, కలుకూరి మంగరాజు, సూర్యనారాయణ మూర్తి, కేసరపు శీను, రమేష్, వరద కామేశ్వరరావు, బెల్లాల పెంటబాబు, ముమ్మిడిశెట్టి ముత్యాలశెట్టి పాల్గొన్నారు.


ట్రస్టు ఏర్పాటులో పాల్గొన్న సభ్యులు

యథేచ్ఛగా గెడ్డల ఆక్రమణ

పట్టని అధికారులు

ప్రజాశక్తి-సీతమ్మధార : గెడ్డలను ఎవరు ఆక్రమించినా చర్యలు తప్పవని జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ హెచ్చరించినా కింది స్థాయిలో ఆచరణలోకి రావడంలేదు. కింది స్థాయి అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో యథేచ్ఛగా కబ్జాలు సాగుతున్నాయి. జివిఎంసి జోన్ -3 పరిధి 26వ వార్డులోని గెడ్డలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా పట్టనట్లు వ్యవహరించడంపై స్థానికులు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. సచివాలయ ప్లానింగ్ సెక్రెటరీ సాక్షిగా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ అక్రమ నిర్మాణాలకు రూ.లక్షల్లో చేతులు మారాయని బహిరంగంగానే విమర్శలు వినిపిస్తున్నాయి.

స్థానిక ఎన్జీవోస్ కాలనీ డోర్ నెంబర్ 49-37-9 ఎదురుగా గెడ్డలో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నా కనీసం దానివైపు జివిఎంసి పట్టణ ప్రణాళిక అధికారులు కన్నెత్తి కూడా చూడటం లేదు. చిన్నారు మసీదు వద్ద అంగన్‌వాడీ కేంద్రం ముందున్న గెడ్డను కూడా ఆక్రమించి జి ప్లస్ టు నిర్మాణం చేపడుతున్నా ఎటువంటి చర్యలూ తీసుకోకపోవడంపై సందేహాలు కలుగుతున్నాయి. దీనిపై స్థానిక ప్లానింగ్ సెక్రటరీ ముత్యాలనాయుడును 'ప్రజాశక్తి' సంప్రదించగా గెడ్డ స్థలం ఆక్రమించి నిర్మాణం చేపట్టడం వాస్తవమేనని, జరిమానా విధించి తగు చర్యలు తీసుకుంటామని చెప్పుకొచ్చారు. జోన్ 3 టిపిఒ అనితను వివరణ కోరగా రెండు అక్రమ భవన నిర్మాణాలపై ఫిర్యాదులు తన దృష్టికి వచ్చాయని, పరిశీలించి తగు చర్యలు చేపడతామని ఆమె తెలిపారు.

ఎన్జీవోస్ కాలనీలో గెడ్డను ఆక్రమించి చేపట్టిన నిర్మాణం

ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణే యుటిఎఫ్ ధ్యేయం

మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ

యుటిఎఫ్ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంవిఎస్.శర్మ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణమే యుటిఎఫ్ ధ్యేయమని ఉత్తరాంధ్ర పట్టభద్రుల మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ అన్నారు. హిస్సిభవన్‌లోని యుటిఎఫ్ కార్యాలయంలో ఆదివారం యూనియన్ 49వ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ప్రధాన వక్తగా ఎంవిఎస్.శర్మ హాజరై ప్రసంగించారు. జిఒ 117 కారణంగా ప్రాథమిక పాఠశాలల మనుగడ ప్రశ్నార్థంగా మారిందన్నారు. విద్య, వైద్య రంగాల నుంచి ప్రభుత్వం తప్పుకోవాలని చూస్తుందన్నారు. క్రమంగా వీటి ప్రయివేటీకరణ దిశగా అడుగులు వేస్తోందని పేర్కొన్నారు. ఇటువంటి తరుణంలో ప్రభుత్వ రంగ ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసి ప్రజల మన్ననలు పొందాలన్నారు. అదే సందర్భంలో ప్రజల సహకారంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న విధానాలను, నూతన జాతీయ విద్యా విధానాన్ని తిప్పి కొట్టాలన్నారు. సిపిఎస్ రద్దు హామీ మద్దతుతో గద్దెనెక్కిన వైసిపి ప్రభుత్వం జిపిఎస్ విధానాన్ని తీసుకురావడం ఉపాధ్యాయుల గొంతు కోయటమేనని పేర్కొన్నారు. 2024 ఎన్నికలలో ప్రతి రాజకీయ పార్టీ పాత పెన్షన్ విధానాన్ని తీసుకొస్తామని హామీ ఇచ్చే విధంగా పోరాటం చేయాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులందరూ ఐక్యంగా పోరాడి ఓట్ ఫర్ ఒపిఎస్ నినాదంతో ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో చిల్డ్రన్స్ క్లబ్ నిర్వాహకులు డాక్టర్ కొరెడ్ల రమాప్రభ మాట్లాడారు. అనంతరం యుటిఎఫ్ జిల్లా కమిటీ ఎన్నికలు జరిగాయి. ఎన్నికల అధికారిగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహనరావు వ్యవహరించారు.

కమిటీ ఎన్నిక

గౌరవాధ్యక్షునిగా అనకాపల్లి పైడిరాజు, జిల్లా అధ్యక్షునిగా దాసరి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా టిఆర్.అంబేద్కర్, అసోసియేట్ అధ్యక్షులుగా ఎన్.ప్రభాకరరావు, రొంగలి ఉమాదేవి, కోశాధికారిగా కె.రాంబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఉప్పాడ రాము, చుక్కా సత్యం, రియాజ్, తాటికొండ జగన్, రిజ్వాన్, వంగా రామలక్ష్మి, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా ఎం.రవిబాబు, రాష్ట్ర కౌన్సిలర్‌గా ఎస్ఎస్.నాగమణి, జిల్లా మహిళా కమిటీ కన్వీనర్‌గా జి.ఉషారాణి, కో-కన్వీనర్‌గా ఆవుగడ్డ సత్యకళ ఎన్నికయ్యారు.

అధ్యక్షులు నాగేశ్వరరావు

ప్రధాన కార్యదర్శి అంబేద్కర్

26న రాధాకృష్ణ మహోత్సవం

ప్రజాశక్తి -గాజువాక : ఈ నెల 26వ తేదీన నిర్వహించే రాధాకృష్ణ మహోత్సవాన్ని జయప్రదం చేయాలని విశాఖ జిల్లా యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షులు భరణికాన రామారావు కోరారు. విశాఖ ఉక్కు యాదవ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యాన పేద నడుపూరు సిడబ్ల్యుసిలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజకీయలకతీతంగా ప్రతి యాదవ కుటుంబం పాల్గొవాలని కోరారు. ఈ సమావేశంలో నమ్మి అప్పలనాయుడు, శ్రీమసిరి శ్రీనివాసరావు, బొట్ట సోమేశ్వరరావు, యలమంచిలి పైడిరాజు, బొకుటి నాగేశ్వరరావు, మొల్లి మారయ్యనాయుడు, యాదవ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

చిత్రకళా పరిషత్ ఇ -మాసపత్రిక విడుదల

ప్రజాశక్తి -ములగాద : చిత్రకళా పరిషత్‌కు చెందిన ఇ - మాసపత్రిక ద్వితీయ సంచికను ఆదివారం మల్కాపురం గ్రంథాలయంలో సెయింట్ ఆన్స్ కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ గెసిల్లా ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చిత్ర కళాపరిషత్తుకు చెందిన ఎగ్జిబిషన్లలోని 33 చిత్రాలు కళాఖండాలేనన్నారు. చిత్రకారులు ద్వారపూడి శ్రీనివాస్ మనోహర్‌ను, శివాను ఆమె అభినందించారు. కార్యక్రమంలో ప్రముఖ చిత్రకారులు ఎస్.చలపతిరావు, కవి కె.సత్తిరాజు, న్యాయవాది జికెవి.రాజు, గ్రంథాలయాధికారి అజయ్‌కుమార్, జాతీయ సేవా పథకం అధికారులు ఇపిఎస్.భాగ్యలక్ష్మి, అనసూయాదేవి పాల్గొన్నారు. ఆవిష్కరణ సంచిక ప్రతులను అందరికీ పంచారు.

మోసాలకు అడ్డుకట్ట వేయాలి

ప్రజాశక్తి- పిఎం పాలెం : గూగుల్ మ్యాప్‌ను ఉపయోగించుకొని మోసాలు చేస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని జిల్లా కలెక్టర్‌కు మెయిల్ ద్వారా సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు ఫిర్యాదు చేశారు. విశాఖ రూరల్ మండలం పిఎం.పాలెం సర్వే నెంబర్ 35లో ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వారిని గుర్తించి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి విశాఖను కార్యనిర్వాహక రాజధాని చేస్తానని ప్రకటించిన తరువాత భూకబ్జాదారులు అడ్డు అదుపు లేకుండా పేట్రేగిపోతున్నారని పేర్కొన్నారు. రోజుకొక కబ్జా వెలుగులోకి వస్తోందని తెలిపారు. పిఎం.పాలెం సర్వే నెంబర్ 35లో విలువైన 600 చదరపు గజాలు ప్రభుత్వ స్థలం గూగుల్ మ్యాప్‌లో సైతం మార్పులు చేసి కబ్జా చేసిన స్థలాన్ని అధికారులు స్వాధీనం చేసుకోవడం పట్ల సిపిఐ తరుపున అభినందనలు తెలిపారు. భూ కబ్జాలకు పాల్పడినది ఎంతటి వారైనా, ఏ పార్టీకి చెందిన వారైనా గుర్తించి చట్టపరంగా శిక్షించాలని కోరారు.

మిణుగురులు పుస్తక పరిచయం

ప్రజాశక్తి-సీతమ్మధార : చల్లపల్లి స్వరూపరాణి రచించిన 'మిణుగురులు' పుస్తక పరిచయ సభను విశాఖ పౌర గ్రంథాలయంలో సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ఆదివారం నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా స్టీల్‌ప్లాంట్ సివిఒ డాక్టర్ ఎస్.కరుణరాజు హాజరై మాట్లాడారు. చరిత్రలో దాగిన బహుజన వీర వనితల చరిత్రను వెలుగులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. మిణుగురులు పుస్తకం మన తర్వాత తరం వారికి కనువిప్పుగా, స్ఫూర్తిగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. ప్రస్తుత ఐటి యుగంలో బ్రాడ్ కాస్ట్ ఆడియోగా పుస్తకాన్ని రిలీజ్ చేస్తే అన్ని వర్గాల వారికి చేరువవుతుందని తెలిపారు. రైటర్స్ అకాడమీ అధినేత, లీడర్ సంపాదకులు వీవీ రమణమూర్తి మాట్లాడుతూ, ఝాన్సీ లక్ష్మీబాయి యుద్ధం నుంచి పారిపోతే ఆమె తరుపున ఝల్కారీ బాయి 7వేల మంది సైన్యానికి అధిపతిగా ఉండి పోరాటం చేశారని ఈ పుస్తకంలో గుర్తు చేశారని తెలిపారు. పుస్తక సమీక్ష కర్త డాక్టర్ కెఎన్.మల్లేశ్వరి మాట్లాడుతూ మిణుగురులో పుస్తకం ప్రస్తుతం తెలుగు సమాజంలో చర్చనీయంగా మారిందన్నారు. చరిత్ర మరిచిపోయిన 26 మంది మహిళల కథనాలను ఎంపిక చేసుకొని రాయడం సాహసమే అన్నారు. సభకు అధ్యక్షత వహించిన న్యాయవాది జహాఆరా మాట్లాడుతూ, పితృ సామ్య సమాజంలో మహిళలకు ప్రాధాన్యత ఉండదని, అలా మరుగున పడిన మహిళల కథనాలు ఈ పుస్తకంలో ఉన్నాయని తెలిపారు. అసమాన సమాజ ఆధిక్యతల్ని ధిక్కరించి అణగారిన స్త్రీల జీవితాలు వెలుగు దారులు చూపిన ధీర వనిత జీవిత కథనాలే ఈ 'మిణుగురులు' అన్నారు. వేణు మాస్టర్ ఆహ్వానం పలికిన సభలో రచయిత డాక్టర్ మాటూరి శ్రీనివాస్, ఏయూ ప్రముఖ జర్నలిస్టు బెందాళం కృష్ణారావు, పిఒడబ్ల్యు నాయకులు లక్ష్మి, సిఎంఎస్ లలిత, ఆలిండియా రేడియో రచయిత బండి సత్యనారాయణ, ఎన్.బాబూరావు తదితరులు ప్రసంగించారు. అనంతరం పుస్తక రచయిత ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూపరాణి మాట్లాడుతూ, మరుగున పడిన చరిత్రలోని మహిళల వీర కథనాలను భవిష్యత్తు తరాలకి అందించాలనే ఉద్దేశంతో మిణుగురులు రాయడం జరిగిందన్నారు. సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్టు (స్పెట్) వ్యవస్థాపకురాలు డాక్టర్ జి. సీతామహాలక్ష్మి తుది పలుకులతో సభ ముగిసింది. కార్యక్రమంలో వివిఎస్.కృష్ణ, టి శ్రీరామ్మూర్తి, వై.నూకరాజు, ఐఎఫ్‌టియు నాయకులు లక్ష్మి, అరుణోదయ సంఘం నాయకులు నిర్మల, విమర్శకుల వర్మ, ప్రజా సంఘాల నాయకులు, సాహిత్య ప్రియులు, తదితరులు పాల్గొన్నారు.

బిజెపి ప్రభుత్వ కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలపై
27, 28 తేదీల్లో విజయవాడలో మహా ధర్నా

ప్రజాశక్తి.- అనకాపల్లి : బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలపై ఈనెల 27 28 తేదీల్లో విజయవాడలో జరుగు మహాధర్నాను జయప్రదం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపునిచ్చింది. ఆదివారం స్థానిక దొడ్డి రామునాయుడు భవనంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ శంకరరావు అధ్యక్షతన నిర్వహించిన అనకాపల్లి జిల్లా కమిటీ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.లోకనాథం మాట్లాడుతూ, కేంద్రంలోని బిజెపి బీజేపీ ప్రభుత్వ తొమ్మిదేళ్ల పాలనలో పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానాలతో కార్మిక, ప్రజా, రైతాంగాన్ని ఇబ్బందులకు గురిచేసిందన్నారు. దీనికి నిరసనగా దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్ర రాజధానుల్లో నవంబరు 27, 28 తేదీలలో మహా ధర్నా చేయాలని సంయుక్త కిసాన్ మోర్చ, కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపునిచ్చాయన్నారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సమస్యలను గాలికి వదిలేసి అంబానీ ఆదానీల సేవలో ఉందన్నారు. రూ.పద్నాలు గున్నర లక్షల కోట్ల పెట్టుబడిదారుల రుణాలను మాఫీ చేసిందని, ఇది ఆరు సంవత్సరాల ఆంధ్ర రాష్ట్ర బడ్జెట్‌కు సమానమన్నారు. కార్మిక చట్టాలను రద్దు చేసి కోడ్స్ కింద మార్చిందని, రైతాంగానికి నష్టం కలిగించే మూడు వ్యవసాయ చట్టాలను, విద్యుత్తును ప్రైవేటీకరణ చేసే బిల్లును తీసుకొచ్చిందన్నారు. దేశానికి నష్టం కలిగించే విధానాలను అవలంబిస్తోందన్నారు. మరోవైపు మతోన్మాదాన్ని, కులతత్వాన్ని పెంచి పోషిస్తుందని మండిపడ్డారు. బిజెపి పాలనలో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్టీల్‌ప్లాంట్, రైల్వేలు ం వంటి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి వినాశకర విధానాలను అవలంబిస్తున్న బిజెపిని ఓడించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు బీజేపీకి వంత పాడుతున్నా యన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న హక్కులను మోడీ ప్రభుత్వం కాలరాస్తోందని, భవిష్యత్తులో కార్మికులు ఐక్యంగా పోరాడి సాధించుకునే పరిస్థితులు ఉన్నాయన్నారు. అసంఘటిత రంగంలో ఉన్న ముఠా, బిల్డింగ్, తోపుడుబండ్లు, మోటార్ కార్మికులకు ఎటువంటి చట్టాలు లేవన్నారు. పంచాయతీ కార్మికులు అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్నారని, స్కీముల్లో పనిచేసే కార్మికులను ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహా పథ్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఏపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. అప్పలరాజు, అధ్యక్షులు కర్రి అప్పారావు, కిసాన్ సంయుక్త మార్చా కన్వీనర్ ఎ.బాలకృష్ణ, సిఐటియు జిల్లా ఆఫీస్ బేరర్స్ వివి. శ్రీనివాస రావు, ఎండిఎం రాష్ట్ర అధ్యక్షురాలు జి.వరలక్ష్మి, వి.సత్యవతి, ఎం దుర్గారాణి, గనిశెట్టి సత్య నారాయణ, ఆర్.రాము, ఎ.రాజు పాల్గొన్నారు.

మహా ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న లోకనాథం, ఇతర నేతలు

మహాధర్నా జయప్రదానికి ప్రచారం

సీతమ్మధార : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 27, 28 తేదీల్లో చేపట్టే మహా ధర్నాలను జయప్రదంచేయాలని కోరుతూ ఆదివారం రైల్వే స్టేషన్ ఇన్ గేట్ వద్ద ఆటో డ్రైవర్ల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జి.వామనమూర్తి మాట్లాడుతూ, కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వాలు చట్టాలను ప్రయివేటు, బడా కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా మారుస్తున్నాయని విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలు, డీజిల్, పెట్రోల్, వంట గ్యాస్, విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై ఆర్థిక భారాలు వేస్తున్న బిజెపి, వైసిపి ప్రభుత్వాల విధానాలపై పోరాడాలని ప్రజలకు పిలుపునిచ్చారు విజయవాడలో నిర్వహించే మహా ధర్నాలో ఆటో, మోటార్ కార్మికులు పాల్గొని ప్రభుత్వానికి కళ్ళు తెరిపించాలని పిలుపునిచ్చారు. ప్రచార కార్యక్రమంలో రావికృష్ణ, వై.వెంకట్, హెచ్.శేఖర్, రింగ్ రాజు, పి.రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

కొత్త విద్యా నిబంధనలతో తిప్పలు

మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమణ

ప్రజాశక్తి- అనకాపల్లి : విద్యా దీవెన, వసతి దీవెన అమలుకు రాష్ట్రప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త నిబంధనలతో విద్యార్థులకు తిప్పలు తప్పలేదని, దీన్ని ఎస్ఎఫ్ఐ అనకాపల్లి జిల్లా కమిటీ వ్యతిరేకిస్తోందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్ రమణ అన్నారు. ఆదివారం. స్థానిక దొడ్డి రామునాయుడు కార్మిక భవనంలో విలేకర్లతో మాట్లాడుతూ, పరీక్షల టైం సమీపిస్తున్న తరుణంలో జాయింట్ అకౌంట్స్ కోసమని విద్యార్థులు, వారి తల్లిదండ్రులను బ్యాంకులు, సచివాలయాల చుట్టూ తిప్పించడం దుర్మార్గమన్నారు. సకాలంలో విద్యాదీవెన వసతి దీవెన నిధులు సక్రమంగా విడుదల చేయకుండా ఇబ్బందులకు గురిచేయడమే కాకుండా, ఇపుడు లేనిపోని నిబంధనలను తెచ్చి, విద్యార్థుల్ని వారి తల్లిదండ్రులను బ్యాంకుల ముందు పడిగాపులు పడేలా చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఈ నిబంధనను వెనక్కి తీసుకోవాలని, విద్యాదీవెన, వసతిదీవెనలను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రెసిడెంట్ ఎం రమణ, ఉపాధ్యక్షుడు జి గీతాకష్ణ, సహాయ కార్యదర్శి శ్రీను, కేశవ , గణేష్, సింహాద్రి పాల్గొన్నారు.

21న జాబ్ మేళా

ప్రజాశక్తి-అనకాపల్లి : ఈనెల 21న అచ్యుతాపురం పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించనున్నట్టు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి టి చాముండేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగ కల్పనలో భాగంగా అచ్యుతాపురం ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో పరవాడ రిఫ్రా టెక్నిక్ కంపెనీలో ఉద్యోగాలకు మినీ జాబ్ మేళా జరుగుతుందన్నారు. ఈ ఇంటర్వ్యూలకు ఐటిఐ.(ఫిట్టర్,వెల్డర్, మెకానికల్, ఎలక్ట్రికల్) చదువుకొని, 18 - 25ఏళ్ల వయస్సు గల యువతీయువకులు పాల్గొనవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 7036363272 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కలుసుకున్న పూర్వవిద్యార్థులు

ప్రజాశక్తి-సబ్బవరం: మండలంలోని మల్లునాయుడుపాలెం జెడ్‌పి హై స్కూల్ 2000-01 బెస్ట్ బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. 23ఏళ్ల తర్వాత కలుసుకుని, నాటి ఉపాధ్యాయులు జేసుదాస్ ఆనంద్, అనితలను ఆహ్వానించి ఘనంగా సత్కరించారు.పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకొని మధురానుభూతిని పంచుకున్నారు. విందు, వినోదాలతో సందడి చేశారు. కార్యక్రమంలో అప్పలనాయుడు, పిఆర్‌పి అప్పలనాయుడు, సింగంపల్లి బంగారునాయుడు, బోకం సునీత పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర'పై శిక్షణ

ప్రజాశక్తి- అనకాపల్లి : 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమ నిర్వహణలో భాగంగా జిల్లాలో 522 గ్రామ, వార్డు సచివాలయాలలోని వాలంటీర్లకు ఆటల నిర్వహణలో శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి వేణుగోపాలరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల పరిధిలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో నిర్వహించే కబడ్డీ, క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, ఖోఖో క్రీడల పోటీలు నిర్వహణకు విధి విధానాలు,అంపైరింగ్ మొదలైన విషయాలపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు.

ఉద్యోగుల బకాయి వెంటనే చెల్లించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఉద్యోగులు ఉపాధ్యాయుల బకాయి జీతాలు తక్షణమే చెల్లించాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలోఏర్పాటు చేసిన యుటిఎఫ్ జిల్లా ఆఫీసు బేరర్ల సమావేశంలో మాట్లాడుతూ ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉద్యోగ ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలను, ఒకటో తేదిన జీతాలు చెల్లించక పోవడం సిగ్గుచేటన్నారు. కష్టపడి పని చేస్తున్న ఉద్యోగ ఉపాధ్యాయులకు వారు దాచుకున్న పిఎఫ్, ఏపీ జిఎల్ఐఎల్, డిఎ తదితర ఆర్థిక బకాయిలు విడుదల చేయడంలో ఎంతో నిర్లక్ష్యంగా ఈ ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.8 వేల కోట్లను బకాయిలకు విడుదల చేయాల్సి ఉందని చెప్పారు. పిఎఫ్, ఎపిజిఎల్ఐ అకౌంటులు ఉద్యోగుల వ్యక్తిగత పిడి అకౌంటుల నుంచి ఆయా ఉద్యోగుల అనుమతి లేకుండా ప్రభుత్వం కూడా నిధులు దారి మళ్లించడం సరికాదన్నారు. ఆ అధికారం ప్రభుత్వానికి లేదన్నారు. గత ఆరు నెలలుగా ఉద్యోగులు దాచుకొన్న ఉద్యోగ, ఉపాధ్యాయుల అకౌంటుల నుంచి రుణ రూపేణా, ఫైనల్ పేమెంట్ల రూపంలోను డ్రా చేసుకొనే అవకాశం ఉండగా, ఆరు నెలలుగా ఆ బిల్లులు ప్రభుత్వం చెల్లించక పోవడం దారుణమన్నారు. ప్రభుత్వం తక్షణమే పెండింగ్ బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.. సంపాదిత సెలవులు నగదుగా మార్చుకొనే ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు ఏడాదిగా నగదు అందలేదని, వాటిని కూడా తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా జిల్లా అధ్యక్షులు వత్సవాయి శ్రీలక్ష్మి, కోశాధికారి జోగా రాజేష్, కార్యదర్శులు రమేష్ రావ్, పొలిమేర చంద్ర రావు, జి. ఎస్. ప్రకాష్, శేషు కుమార్, రాష్ట్ర కౌన్సిలర్లు ఎల్లయ్యబాబు, గంజి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చిన్నబ్బాయి

రోడ్లు బాగుచేయడంలో వైసిపి విఫలం

మాట్లాడుతున్న నాగ జగదీష్

ప్రజాశక్తి.-అనకాపల్లి : జిల్లాలో రోడ్ల నిర్మాణంలో మంత్రులు గుడివాడ అమర్నాథ్, బూడి ముత్యాల నాయుడు విఫలమయ్యారని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు ఆరోపించారు. ఆదివారం స్థానిక రింగ్ రోడ్డులోని పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, 2019లో జగన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత నాలుగున్నరేళ్లలో రూ.10 లక్షల 97 వేల కోట్ల అప్పులు చేసి, నవరత్నాల పేరిట 2 లక్షల 31 వేల కోట్లు పేదలకు పంచామని గొప్పలు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. 2022 జూన్ నాటికి రోడ్డు నిర్మాణాలు పూర్తి చేయాలని, రూ.2200 కోట్లు ఆర్అండ్‌బికి నిధుల విడుదల చేశామనిసాక్షాత్తు ముఖ్యమంత్రి చెప్పినా నేటికీ రోడ్లు ఎక్కడా నిర్మాణం జరగలేదని ఆరోపించారు.

యలమంచిలి నియోజకవర్గంలో మునగపాక మండలం నాగులపల్లి జంక్షన్ నుండి అచ్యుతాపురం మండలం పూడిమడకు వెళ్లే రహదారి అధ్వానంగా ఉందన్నారు. అచ్యుతాపురం సెజ్‌లోని పరిశ్రమల సహకారంతో తాత్కాలికంగా గుంతలు పూడ్చినా, మళ్లీ పాతస్థితికే వస్తున్నాయన్నారు. జిల్లా మంత్రులు గుడివాడ అమర్నాథ్, బూడి ముత్యాల నాయుడులతోపాటు అధికార యంత్రాంగం రోడ్ల దుస్థితి పట్టనట్లు వ్యవహరించడం ప్రభుత్వం చేతకానితనం, వైఫల్యానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి కడిమిశెట్టి నరసింగరావు పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శి కొట్ని రామకష్ణ పట్టణ శాఖ ఉపాధ్యక్షులు బోడి వెంకటరావు కమిటీ సభ్యులు బర్నికాన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'రాగూర్' ఫార్మా కార్మికునికి
మెరుగైన వైద్యం అందించాలి : గనిశెట్టి

ప్రజాశక్తి - పరవాడ: పరవాడ ఫార్మసిటీలోని రాగూర్ ల్యాబొరేటరీ ఫార్మా పరిశ్రమలో హెచ్‌సిఎల్ ట్యాంకు లీకేజీతో తీవ్రంగా గాయపడిన కార్మికుడు సాయిరామ్‌కు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్(సిఐటియు) గౌరవాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ప్రమాదస్థలాన్ని పరిశీలించి అనంతరం మాట్లాడుతూ, రాగూర్ ఫార్మా ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. గతంలోనూ ఇదే పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో ఒక కార్మికుడు మృతి చెందాడని, తాజా ప్రమాదంలో ఒక కార్మికుడు తీవ్రంగా గాయపడిన నేపథ్యంలో కంపెనీలో భద్రత ప్రమాణాలపై సమగ్ర విచారణ జరిపి, యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు గనిశెట్టి తెలిపారు

ఘనంగా మహిళా సమ్మేళనం

ముత్యాల బ్రదర్స్‌కు మహిళల సత్కారం

ప్రజాశక్తి- మునగపాక రూరల్: మేజర్ పంచాయతీ మునగపాక మధ్యవీధిలో మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన మహిళా సమ్మేళనంలో వ్యాపారవేత్త ముత్యాల వెంకటేశ్వరరావు, తనయులు ముత్యాల సతీష్ బాబు, రాజేష్ బాబులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. పలువురికి నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ఎంవిఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంబులెన్స్ సర్వీసులు, ఉచిత నిత్య తీర్థయాత్రలు, మెడికల్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. త్వరలో రాజకీయాల్లోకి రానున్న తన తండ్రి ఎంవిఆర్‌కు అండగా నిలవాలని కోరారు. అధికారంలో లేనపుడే ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్న తన తండ్రికి ఒక్కసారి అవకాశమివ్వాలని కోరారు. అధికసంఖ్యలో మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలులో ఆదర్శం

భవనాలను ప్రారంభిస్తున్న మంత్రి బూడి, ఎంపీ సత్యవతి

ప్రజాశక్తి-దేవరాపల్లి : అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో ఇతర రాష్ట్రాలకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆదర్శంగా నిలిచారని ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. ఆదివారం మామిడిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన గామ సచివాలయం, రైతు భరోసా, హెల్త్ క్లినిక్, గ్రంథాలయం, వాటర్ ట్యాంక్, నాడు నేడు నిధులతో పనులు పూర్తి చేసుకున్న పాఠశాలను ప్రారంభించారు. నూతనంగా ఏర్పాటు చేసిన గౌతమ బుద్ధుడు, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి విగ్రహాలను ఎంపీ సత్యవతితో కలిసి ఆవిష్కరించారు. గ్రామంలోని నూకాలమ్మ, మరిడిమాంబ ఆలయాలను దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు.అన్నసమారాధనలో పాల్గొన్నారు. జెడ్‌పిటిసి కర్రి సత్యం, సర్పంచ్ కర్రి సూరినాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయం చైర్మన్ రమాదేవి, వైసిపి జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు కిలపర్తి భాస్కరరావు,ఎంపిపి కిలపర్తి రాజేశ్వరి, వైస్ ఎంపిపిలు బుల్లిలక్ష్మి, గంగాభవాని, స్థానిక ఎంపిటిసి పంచాద సింహాచలం నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు బూరె బాబురావు, మండల మహిళా విభాగం అధ్యక్షురాలు రొంగలి నారాయణమ్మ, పాల్గొన్నారు.

ఘనంగా జాప్ వార్షికోత్సవం

ప్రజాశక్తి- అనకాపల్లి :ఐక్యంగా ఉంటే జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించుకోవచ్చని ఎంపీ డాక్టర్ బివి. సత్యవతి పేర్కొన్నారు. నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్ అనుబంధ జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(జాప్) 31వ వార్షికోత్సవాలన ఎంపీ కేకు కట్ చేసి ప్రారంభించారు. పేదలకు దుప్పట్లు ,పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. డాక్టర్ విష్ణుమూర్తి, ఎస్ఐ సత్యనారాయణ, జర్నలిస్టు సంఘం ప్రతినిధులు వెంకటరావు, సాయిరాం, రమేష్, విజయ్ కుమార్, రామచంద్ర రావు, ఎస్. శ్రీనివాసరావు, భూలోక నాయుడు, సలహాదారులు సత్యనారాయణ, మాణిక్యం, శ్రీను,కన్వీనర్ రాజేష్, అజయ్ ప్రసాద్, గోపి, నాగార్జున, రిషి, భవాని శంకర్, గౌరీ శంకర్, కల్యాణ్ రామ్, ఒమ్మి వెంకట్ యాదవ్ పాల్గొన్నారు.

61 మందికి ఉచిత కంటి పరీక్షలు

ప్రజాశక్తి- కె.కోటపాడు :జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో డాక్టర్ వైఎస్ఆర్ కంటి వెలుగులో భాగంగా నిర్వహించిన కంటి వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని ఎంపిపి రెడ్డి జగన్మోహన్ కోరారు. ఆదివారం కె.కోటపాడు శివాలయం వద్ద కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో 61 మంది కంటి రోగులు పరీక్షలు చేయగా 34 మందికి కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. ఉచిత ఆపరేషన్ కోసం వీరిని శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రికి రిఫర్ చేశామని ఆసుపత్రి కోఆర్డినేటర్స్ సిహెచ్ అశ్వినికుమార్, కె ప్రసాద్ తెలిపారు.కార్యక్రమంలో ఆఫ్తాల్మిక్ సిబ్బంది పాల్గొన్నారు.

నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి : సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ నారాయణ సూచనలతో అనకాపల్లిలో జెడి ఫౌండేషన్ నిర్వహిస్తున్న సామాజిక సేవ కార్యక్రమం లో భాగంగా శనివారం రాత్రి అనకాపల్లి జాతీయ రహదారి, రైల్వే స్టేషన్, రింగ్ రోడ్డు తదితర ప్రాంతాల లో నిద్రిస్తున్న 30 మంది నిరాశ్రయులు, పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు సుదురుపాటి తాతాజీ, శ్రీనివాస్, వరలక్ష్మి పాల్గొన్నారు. దీనజనోద్ధరణ మహా సంకల్పయాత్రకు నడుం బిగించిన జెడి ఫౌండేషన్ సభ్యులకు, దాతలకు తాతాజీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

ఫార్మా కాలుష్యం పాలకులకు పట్టదా?

ప్రజలు అవస్థలు పడుతున్నా పట్టించుకోని ప్రభుత్వం
చోద్యం చూస్తున్న కాలుష్య నియంత్రణ మండలి అధికారులు

ప్రజాశక్తి - పరవాడ: ఒకటి, రెండు ఫార్మా కంపెనీలుంటేనే దాదాపు 15 కిలోమీటర్ల మేర భూగర్భ జలాలు విషతుల్యమవుతాయి. వాయు కాలుష్యం ఏర్పడుతుంది. అలాంటిది పరవాడ రాంకీ ఫార్మా సిటీలో వందల సంఖ్యలో ఔషధ పరిశ్రమలను ఏర్పాటు చేస్తే చుట్టూ పరిసర ప్రాంతాల్లో పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవడానికే భయమేస్తోంది. పరవాడ, తానాం, తాడి, ఈ.బోనంగి, గొర్లివానిపాలెం, భరిణికాం, సాలాపువానిపాలెం, లంకెలపాలెం తదితర ప్రాంతాల్లో నివాసితులు అచ్చంగా ఇలాంటి కాలుష్య సమస్యతో సతమతమౌతున్నారు.ఫార్మా పరిశ్రమల నుంచి విడుదలవుతున్న వ్యర్థజలాలు, దుర్గంధం, విషవాయువులతోఉక్కిరి బిక్కిరవు తున్నారు. స్వచ్ఛమైన ఆక్సిజన్ అందక రోగాల బారిన పడుతున్నారు. కొంతకాలానికి ఈప్రాంతంలో బోర్లు వేస్తే విషపు జలాలు ఉబికి వచ్చే అవకాశం ఉందని నిపుణులు ఇప్పటికే హెచ్చరిస్తున్నారు.. ఫార్మా కంపెనీల పరిధిలో జీవించే ప్రజలకు రోగ నిరోధక శక్తి తక్కువగా ఉంటుందని, దీంతో అక్కడి ప్రజలు ఏ చిన్న అనారోగ్యం చేసినా, అధిక మోతాదులో ఉండే మందులను వాడాల్సి వస్తోందని మేధావులు, నిపుణులు ఇదివరకే హెచ్చరించిన పరిస్థితులు అపుడే ఇక్కడ ఉత్పన్నమయ్యాయి. కాలుష్య రహిత ఫార్మా కంపెనీలు వస్తున్నాయని ప్రజలను మభ్యపెట్టి వీటిని ఏర్పాటు చేసిన ప్రభుత్వాలు, ఇపుడు కాలుష్యసమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే పట్టించుకునే దిక్కులేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పెద్ద దేశాల్లో ఫార్మా కంపెనీలు ఎందుకు స్థాపించడం లేదనే ప్రశ్నకు ఇదే సమాధానమైనప్పటికీ, ఇక్కడి ప్రభుత్వం దీనిపై నోరు మెదపడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. యూరోపియన్ యూనియన్,, అమెరికా లాంటి దేశాలకు మన రాష్ట్రంలో పరవాడ ఫార్మా కంపెనీల నుంచి ఎగుమతయ్యే మందులనే అత్యధికంగా వినియోగిస్తున్నారంటే, వారి ఫార్మా కంపెనీలకు ఎంత దూరంగాఉన్నారో స్పష్టమౌతోందని చెప్పకనే చెప్పినట్లు అవుతుందని పలువురు అంటున్నారు.. ప్రజారోగ్యాలను, ప్రజల జీవన విధానాలను పరిగణనలోకి తీసుకోకుండా, లాభాపేక్షతో ఫార్మా కంపెనీలు పెట్టడంతో ఇక్కడ ప్రస్తుతతరంతోపాటు భవిష్యత్ తరానికి ఎంతటి ప్రమాదం పొంచి ఉందో తెలిసినప్పటికీ ఎవరికీ పట్టడం లేదనే ఆరోపణలూ ఉన్నాయి. ఇతరదేశాల్లో కాలుష్య కారక పరిశ్రమల ఏర్పాటుపై కఠినచట్టాలు అమలులో ఉంటే, మన ప్రభుత్వాలు మాత్రం గ్రీన్ ట్రిబ్యునల్, ఇతర కోర్టుల ఆదేశాలు తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు వ్యతిరేకిస్తున్నారు. ఈ ఫార్మాసిటీ ఆనుకోని ఉన్న నివాస ప్రాంతాలో చేపట్టాల్సిన చర్యలపై చి ప్రభుత్వ కార్యాచరణ దాదాపు శూన్యమని ఆరోపణలున్నాయి. కంపెనీల ఏర్పాటుకు భూములు లాక్కొన్న ప్రభుత్వాలు, పరిశ్రమలు ప్రజల ఆరోగ్యం, బాగోగులు పట్టించుకోవాలని నిబంధనలు, ఒప్పందాలు ఉన్నా అవన్నీ కాగితాలు, మాటల్లోనే తప్ప ఆచరణలో అమలు కాకపోవడం వల్లే నానాటికీ ఫార్మా కాలుష్యం పెరుగుతూ, ప్రజలను ప్రమాదంలోకి నెడుతోందనే ఆందోళన వ్యక్తమౌతోంది.

అచ్యుతాపురం సెజ్‌లోని ఫార్మా కంపెనీలు

పూడిమడకలో జెట్టీ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి -అచ్యుతాపురం : పూడిమాడకలో రూ.395కోట్లతో జెట్టి నిర్మాణ పనులకు ఆదివారం ఎమ్మెల్యే కన్నబాబు రాజు, గ్రామ సర్పంచ్ చేపల సుహాసిని వెంకటరమణ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జెట్టి నిర్మాణంతో నాలుగువేల మందికి ఉపాధి అవకాశాలు పొందవచ్చని చెప్పారు. అలాగే తొమ్మిది వందల .పూడిమడక, రాంబిల్లి, విశాఖ బోట్లు పెట్టడానికి అవకాశం ఉంటుందన్నారు. జెట్టి నిర్మాణంతో ఫిష్ మార్కెట్ వస్తుందన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీల్లో ఒక్కటొక్కటిగా అమలు చేస్తోందని, అందులో భాగంగా మత్స్యకారుల ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకుని జెట్టి నిర్మాణం చేపడుతున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జడ్పిటిసి రాంబాబు, పెంటయ్య, వైసిపి మండల అధ్యక్షుడు దేశెట్టి శంకరరావు, మన బుజ్జి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కన్నబాబు సమక్షంలో జెట్టి నిర్మాణానికి శంకుస్థాపన

గ్రంథాలయాల్లో ఘనంగా మహిళా దినోత్సవం

కశింకోట గ్రంథాలయ వారోత్సవాల్లో వైస్ ఎంపిపి

ప్రజాశక్తి- కశింకోట : జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా కశింకోట గ్రంథాలయం లో వైస్ ఎంపిపి పెంటకోట జ్యోతి పాల్గొని, కోలాటం పిల్లలకు బేచాన్ పంపిణీ చేశారు. ఆర్ఇసిఎస్ మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీను, ఉపాధ్యా యులు వై రామచంద్రరావు, కె.వరలక్ష్మి పాల్గొన్నారు.

మునగపాక రూరల్: స్థానిక శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి ఎల్వి.రమణ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి ప్రణతి స్కూల్ ఉపాధ్యాయురాలు ఆశా దేవి పూలమాలలు వేసి నివాళులర్పించారు.. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత శివకోటి దుర్గాప్రసాద్ క్విజ్ మాస్టర్‌గా క్విజ్ పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయులు పిళ్లా జగదీష్, బి గణేష్ కుమార్, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు పెంటకోట తులసిరావు పాల్గొన్నారు.

అనకాపల్లి : స్థానిక శాఖవీధి శాఖ గ్రంథాలయంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయిని కోసూరు అన్న పూర్ణకు ఇందిరాగాంధీ ఉత్తమ మహిళా ఉద్యోగి 2023 పురస్కారం ప్రదానం అందజేశారు. సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు బల్లా నాగభూషణం ఆధ్వర్యంలో పూర్వ హెచ్‌ఎం పి.జె.నాయుడు, లైబ్రేరియన్ కె.శ్రీనివాసరావు, సిద్ధార్థ సంస్థ ఉపాధ్యక్షులు వినకోట నీలేష్ గుప్తా, సభ్యులు పట్నాల కృష్ణ మోహన్, పొన్నా చల్మాజీ రావు, పొట్టి శ్రీరాములు అభిమాని పిరాట్ల నరసింహ మూర్తి కోసూరు రామకృష్ణ, మహిళా కవయిత్రులు రాయవరపు సరస్వతి, కర్రి మల్లీశ్వరి పాల్గొన్నారు.

సబ్బవరం : స్థానిక శాఖా గ్రంథాలయంలో వారోత్సవాలలో భాగంగా గ్రంథాలయాధికారి వి.శిరీష ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

భీమునిపట్నం : జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని ఆదివారం నిర్వహించారు. ముందుగా ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఎం.లక్ష్మణరావు, విశ్రాంత హెచ్ఎం దత్తి ఈశ్వరరావు, గ్రంథాలయాధికారి మహేష్ పాల్గొన్నారు.

పెందుర్తి : జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా పెందుర్తి శాఖ గ్రంథాలయంలో ఇందిరాగాంధీ జయంతిని, మహిళా దినోత్సవాన్ని గ్రంథాలయాధికారి బత్తిన సూర్యకళ ఆధ్వర్యాన నిర్వహించారు. 97వ వార్డు కార్పొరేటర్ శానాపతి వసంత, నాయకులు శంకరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ఇందిర గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు వేసిన ముగ్గులను పరిశీలించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంగీతం ఉపాధ్యాయులు కొత్తపల్లి భానుమతి, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ వైస్‌ప్రెసిడెంట్ పి.భూలోకరావు, కార్యదర్శి ఆదారి రామకృష్ణ, టీచర్ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ములగాడ : మహిళలు విద్యావంతులు, చైతన్యవంతులు కావాలని సెయింట్ ఆన్స్ కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ గెసిల్లా అన్నారు. మల్కాపురంలోని శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సాధికారత సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా సిస్టర్ గెసిల్లా హాజరై మాట్లాడారు. మహిళలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ప్రజా వైద్యులు డాక్టర్ పి.హేమలత, జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి, సీనియర్ ప్రోగ్రామ్ అధికారి వై. అనసూయాదేవి, కె.సత్యానందం, ఎస్.చలపతిరావు, సత్తిరాజు, జెకెవి.రాజు, గ్రంథాలయాధికారి వి.అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. తొలుత ఇందిరాగాంధీ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

గొలుగొండ:స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి రాజుబాబు ఆధ్వర్యంలో ఆదివారం దిశ చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళా కానిస్టేబుల్ వరలక్ష్మీ మాట్లాడుతూ, మహిళలు, బాలికలకు దిశ చట్టం అండగా నిలుస్తుందన్నారు. అనంతరం ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు.

రోలుగుంట:స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి వరలక్ష్మీ ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అంతకు ముందు ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోలుగుంటలో డ్రాయింగ్ పోటీల్లో విద్యార్థులు

ప్రజాశక్తి 7
సోమవారం 20 నవంబర్ 2023

వరిపై సన్నగిల్లిన ఆశలు

- ఎండిన పంటలు - ఆందోళనలో తాండవ కాలువ రైతులు

ప్రజాశక్తి-కోటవురట్ల:మండల వ్యాప్తంగా ఈ ఏడాది తీవ్ర వర్షా బావ పరిస్థితుల కారణంగా వరి రైతు ఆశలు సన్నగిల్లాయి. మండలంలో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసే వరిపై ఆధారపడి రైతులు అత్యధికంగా ఉన్నారు. మండలంలో సుమారు 1600 హెక్టార్లలో వరి సాగు చేయాల్సి ఉండగా సుమారు 1500 వరకు సాగు అయినట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. మండలంలో ప్రధాన నీటి వనరు వరహానది, సర్పా నదీలు ఉన్నాయి. తాండవ కాలువ నుంచి ఈ ఏడాది ఆది నుంచి అంతంత మాత్రమే నీటి సరఫరా అయ్యింది. ఖరీఫ్ సీజన్ ఆరంభంలో కురిసిన వర్షాలకు రైతులు వరిపై ఆశలు పెంచుకొని నాట్లు వేశారు. ఏదోలా ఉన్న కొద్దిపాటి నీటి వనరులతో పొట్ట దశకు వరి పొలాలు చేరుకున్నాయి. తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా ప్రధానంగా తాండవ కాలువపై ఆధారపడ్డ రైతుల పంట పొలాలు తీవ్రంగా ఎండి పోతున్నాయి. ప్రభుత్వం ఇప్పటికీ కరువు మండలంగా ప్రకటించక పోవడంతో రైతులు మరింత ఆందోళన చెందుతున్నారు. అధికారులు, నాయకులు ఇప్పటికైనా స్పందించి మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని కోరుతున్నారు.

కోటవురట్ల మండలం పాముల వాక వద్ద ఎండుతున్న వరి పంట

రావికమతంలో ఎండిన వరి

ఎండిన తాండవ కాలువ

రావికమతం:ఈ ఏడాది వరుణుడు కరుణించక పోవడంతో రైతాంగం పూర్తిగా నష్టపోయింది. మండలంలో ప్రముఖంగా ప్రధానంగా వరి, చెరుకు పంటలు పండిస్తున్నారు. ఇందులో వరి పంట ప్రధానమైంది. గత ఏడాది వరకు వర్షాకాల ప్రభావంతో పాటు పెద్దేరు రిజర్వాయర్ కాలువ నీరు కూడా పుష్కలంగా రావడంతో వందలాది ఎకరాలలో పంటలు పండేవి. ఈ ఏడాది వర్షాలు పడక పోవడంతో పాటు పెద్దేరు రిజర్వాయర్ కాలువ నీరు కూడా రాక పోవడంతో రైతాంగం పూర్తిగా నష్టపోయింది. వరి పంటలు పొట్ట దశకు వచ్చే వరకు అడపాదడపా కాలువలు, చెరువులు, నీటి గుంటలో ఉన్న నీటితో మోటార్లు పెట్టి తడుపుకొని రక్షించుకున్నారు. వర్షాలు నేటి వరకు పడక పోవడంతో వరి పంటలు పూర్తిగా వట్టి గడ్డిని తలపిస్తున్నాయి. పెట్టిన పెట్టుబడి సైతం రాకపోగా తెచ్చిపెట్టిన అప్పులకు వడ్డీలు కట్టుకోలేని పరిస్థితి నెలకొందని రైతాంగం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

శరవేగంగా డ్రైయినేజీ పనులు

ప్రజాశక్తి-రావికమతం:మండల కేంద్రంలో రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. రావికమతం-చోడవరం-నర్సీపట్నంకు వెళ్లే ఆర్ అండ్‌బి రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించి పూర్తిస్థాయిలో డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో, ఈ రోడ్డు గుండా ప్రయాణం సాగించేవారు, పరిసర ప్రాంత ప్రజలు ఎటువంటి అసౌకర్యానికి గురి కాకుండా చక్కగా రోడ్డు విస్తరణతో పాటు ఇరువైపులా డ్రైనేజీ వ్యవస్థను కూడా ఏర్పాటు చేయడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు ఆక్రమణలకు గురవడంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు తప్పుకోవడానికి వీలు పడేది కాదు. పలు ప్రాంతాల నుంచి మండల కేంద్రానికి వచ్చిన ప్రజలు, పాఠశాల విద్యార్థులు ఇబ్బందులు పడేవారు. కొన్ని సార్లు ప్రమాదాలు కూడా జరిగేవి. ఇటువంటి తరుణంలో ఈ ఆక్రమణలను తొలగించి రోడ్డును విస్తరించడంతో వర్షానికి వచ్చే నీరు రోడ్డుపై పారకుండా, నిల్వ ఉండకుండా డ్రైనేజీ నుంచి వెళ్లే విధంగా చేయడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నిర్మాణంలో కాలువ

రక్తదానం చేస్తున్న దాతలు

ఎం.ఎల్.పురంలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని ఏఎల్‌పురం ఎంపియుపి పాఠశాలలో ఆదివారం సత్యసాయి బాబా జయంతి సందర్భంగా శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ఏఎల్‌పురం, కొంగసింగి, పాతకేడిపేట, రామచంద్రపురం గ్రామాల నుండి సుమారు 100 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

జనసేనలో చేరిక

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలోని ఎంకె.పట్నం, శరభవరం గ్రామాలకు చెందిన పలువురు ఆదివారం జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పివిఎస్ఎన్.రాజు వీరికి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బలిజి మహారాజు, పరవాడ దొరబాబు, డి ఎస్.నాయుడు, రమేష్ , సాయి, త్రినాథ్, జగ్గ నాయుడు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

కొంతలంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలోని కొంతలం గ్రామంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. విశాఖ మెడికోవర్ హాస్పటల్ సౌజన్యంతో ప్రముఖ వైద్యులు ఈ శిబిరంలో పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంకు హాజరైన జనసేన పార్టీ చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పివిఎస్ఎన్.రాజు మాట్లాడుతూ,ఈ శిబిరంలో 160 మందికి వైద్య పరీక్షలు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బలిజి మహారాజు, పరవాడ దొరబాబు, డిఎస్.నాయుడు, రమేష్ , బాబ్జి పాల్గొన్నారు.

పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

ఘనంగా ఇందిరా గాంధీ జయంతి

ప్రజాశక్తి -చీడికాడ: మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ జయంతి వేడుకలను అర్జునగిరి ఎంపీటీసీ ఎస్సీ సెల్ అధ్యక్షులు పరదేశి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అనకాపల్లి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బొడ్డు శ్రీనివాసరావు మాట్లాడుతూ, దేశంలో వివిధ సంస్కరణలు ఆమె చేశారన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ సెక్రటరీ జోగారావు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

నక్కపల్లి:మండలంలోని చినదొడ్డిగల్లు గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయ అధికారి జనార్దన్ ఆధ్వర్యంలో ఆదివారం మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మాడుగుల: స్థానిక గ్రంథాలయంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందిరా గాంధీ చిత్రపటానికి సర్పంచ్ ఎడ్ల కళావతి నివాళి అర్పించారు. గ్రంథాలయం ఆవశ్యకతపై వ్యాసరచన పోటీలు, సంక్షేమ పథకాలపై డిబేట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి వై. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కోటవురట్ల: స్థానిక గ్రంథాలయంలో ఇందిరాగాంధీ చిత్రపటానికి గ్రంథాలయాధికారి అప్పలనాయుడు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దిశ చట్టంపై చిన్నారులకు వివరించారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు.

చీడికాడ:స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారిణి ఎంఎస్ఎల్ జోగేశ్వరి ఆధ్వర్యంలో విద్యార్థులకు పాటల, డాన్స్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈనెల 20న గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామని తెలిపారు.

నర్సీపట్నం టౌన్:పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నంగిన రమణ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక రామారావుపేటలో ఇందిరమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మీసాల సుబ్బన్న మాట్లాడారు. నర్సీపట్నం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి దమయంతి ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ జయంతిని నిర్వహించారు. స్థానిక సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం వార్డెన్ విజయరాజ్యలక్ష్మీ, సచివాలయం పోలీస్ సిహెచ్.భవాని మహిళా సాధికారితపై అవగాహన కల్పించారు.

భీమునిపట్నం : మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఆదివారం పిసిసి సభ్యులు తెడ్డు రామదాసు ఆధ్వర్యాన రోగులకు పాలు, పండ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో నిమ్మకాయల పైడిరాజు, ఎల్లయ్య, పాల్గొన్నారు.

పెందుర్తి : 97వ వార్డు పరిధి పెందుర్తిలోని ఇందిరాగాంధీ విగ్రహానికి కాంగ్రెస్ పెందుర్తి నియోజకవర్గం ఇన్‌ఛార్జి ఆడారి రమేష్ నాయుడు, ఆంధ్రప్రదేశ్ యువజన కాంగ్రెస్ స్టేట్ జనరల్ సెక్రటరీ షేక్ షఫీ ఉల్లా పూలమాల వేసి నివాళులర్పించారు. పెందుర్తి మండల కాంగ్రెస్ అధ్యక్షులు ముక్కా రామనాయుడు, కిసాన్ సెల్ ప్రెసిడెంట్ గండిబాబు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కొమ్మోజు లక్ష్మాజీ పాల్గొన్నారు.

అనకాపల్లి : దేశం కోసం ప్రాణాలర్పించిన మహానేత ఇందిరా గాంధీ అని అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు, న్యాయవాది ఐ.ఆర్.గంగాధర్ అన్నారు. ఆదివారం గాంధీనగర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనకాపల్లి పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు దాసరి సంతోష్, ఏపి ప్రొఫెషనల్ కాంగ్రెస్ రాష్ట్ర లీగల్ కోఆర్డినేటర్ పాల్గొన్నారు.
తుమ్మపాల ఇందిరా కాలనీలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు కాళ్ల వెంకట సత్యనారాయణ, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి కట్టమూరి నూక అప్పారావు ఆధ్వర్యంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కట్టమూరి నూకఅప్పారావు,అనకాపల్లి నియోజకవర్గం కో ఆర్డినేషన్ కమిటీ సభ్యులు కాళ్ల వెంకటసత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పెన్సిల్ ముల్లుపై వరల్డ్ కప్

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని చినదొడ్డిగల్లు గ్రామానికి చెందిన సూక్ష్మ కళాకారుడు, గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ గ్రహీత గట్టెం వెంకటేష్ పెన్సిల్ ముల్లుపై వరల్డ్ కప్ అద్భుతంగా ఆవిష్కరించాడు. ఆదివారం ఇండియా - ఆస్ట్రేలియా మధ్య జరిగే వన్డే వరల్డ్ కప్ క్రికెట్ పోటీలు పురస్కరిం చుకుని తన కళా నైపుణ్యంతో పెన్సిల్ ముల్లు పై 4 గంటలు శ్రమించి వరల్డ్ కప్ ప్రతిరూపాన్ని తీర్చిదిద్దాడు.

జాతీయ ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి-రావికమతం:2023-24 విద్యా సంవత్సరంనకు గాను విభిన్న ప్రతిభావంత విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం ద్వారా అందిస్తున్న జాతీయ ఉపకార వేతనాలు పొందుటకు ఈనెల 30వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మినాయుడు, జగన్నాథ నాయుడులు తెలిపారు. ఈ ఉపకార వేతనాలు పొందుటకు 9, 10 తరగతి చదువుతున్న దివ్యాంగ విద్యార్థులు మాత్రమే అర్హులు అన్నారు. మేడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మి నాయుడు మాట్లాడుతూ, గత సంవత్సరం రావికమతం మండలం నుండి 36 మంది దివ్యాంగ విద్యార్థులు జాతీయ ఉపకార వేతనాలుకు ఎంపికయ్యారని, వారికి మూడు లక్షల 24 వేలు వారి అకౌంట్లో జమ అయ్యాయని తెలిపారు. ఈ సంవత్సరం కూడా వారు 30వ తేదీలోపు రెన్యూవల్ చేసుకోవాలని కోరారు. కొత్తగా దరఖాస్తు చేసుకునేవారు

ఆధార్ కార్డు, యు.డి.ఐ.డి కార్డు, రేషన్ కార్డు, ఫోటో, సదరం సర్టిఫికెట్, బ్యాంక్ ఎకౌంట్, కుల ధృవీకరణ పత్రాలతో నేషనల్ స్కాలర్షిప్ పోర్టల్లో ఈనెల 30వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. నేషనల్ స్కాలర్షిప్‌కు ఎంపికైన శారీరక వైకల్యం గల దివ్యాంగ విద్యార్థులకు సంవత్సరానికి రూ.9000, మానసిక, దృష్టి వైకల్యం దివ్యాంగ విద్యార్థులకు 11 వేలు, కస్తూరిబా పాఠశాలలో చదువుతున్న దివ్యాంగ విద్యార్థులకు రూ.14,600 చొప్పున ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు.

ఆలయం వద్ద వన సమారాధన

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:నర్సీపట్నం ఉత్తరవాహిని సత్యనారాయణ స్వామి దేవాలయం వద్ద ఆదివారం ఆర్యవైశ్యుల వన సమారాధనలో కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సత్యనారాయణ స్వామికి సామూహిక వ్రతాలు వాసవి మాత అమ్మవారి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. ప్రముఖ వ్యాపారవేత్త వెలగ నారాయణరావు, ఆర్యవైశ్య సంఘం పెద్దలు పాల్గొన్నారు.

రూ.60 వేల విరాళం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:మున్సిపాలిటీ పీనారిపాలెం లోని అయ్యప్ప భక్తులకు నిత్య అన్నదానం నిమిత్తం ఏపియుడబ్ల్యూజె రాష్ట్ర కార్యదర్శి కిశోర్ చింతల రూ.60వేల విరాళాన్ని అందజేశారు. ఇక్కడ 41 రోజుల పాటు 300 మంది అయ్యప్ప భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నారు.

పోటెత్తిన పర్యాటకులు

ప్రజాశక్తి-అనంతగిరి:ఏజెన్సీలోని అరకు, అనంతగిరిలోని ప్రముఖ పర్యాటక కేంద్రాలు వేలాదిమంది పర్యాటకులతో పోటెత్తాయి.వరుసగా రోజులు సెలవు దినాలు కావడంతో ప్రభుత్వ ఉద్యోగులు అనంతగిరి. బొర్రా గుహలు. కటికి. .తాడిగుడ జలపాతాలతో పాటు అనంతగిరి అటవీ ఘాట్ రోడ్డు మలుపులను సందర్శించారు. డమ్ముకు, సుంకరమెట్ట, యు పాయింట్, అనంతగిరి కాఫీ ప్లాంటేషన్ తదితర ఆహ్లాదకరమైన ప్రదేశాలను తిలకిస్తూ కుటుంబ సమేతంగా ఆనందంగా గడపారు.బొర్రా గుహలు తిలగించిన పర్యాటకులు ఆశ్చర్యానికి లోనయ్యారు. గుహలపై వివరాలను గాడ్స్‌ని అడిగి తెలుసుకున్నారు.

చూసొద్దాం ..రారండి

- సుందరంగా పర్యాటక ప్రాంతాలు - ఆకట్టుకుంటున్న అల్లూరి పార్క్

అల్లూరి పార్కు

ప్రజాశక్తి-గొలుగొండ:కార్తీకమాసం వచ్చిందంటే నర్సీపట్నం పరిసర ప్రాంతాల ప్రజలంతా ఒక్కసారిగా విహార యాత్రలకు గొలుగొండ మండలం వైపు వస్తున్నారు. మండలంలో విహార యాత్రలకు ధారమఠం, అల్లూరి పార్కు, కేడిపేటకు సమీపంలో ఉన్న వల్సంపేట జలపాతం అందరి దృష్టిని ఆకర్షిస్తాయి.

మండలంలో దారమఠంలో వెలిసిన ధారమల్లేశ్వరస్వామి దేవాలయ ప్రాంతంకు వెళితే దైవదర్శనంతో పాటుగా ఆహ్లాదకరమైన వాతావరణంలో గడపవచ్చు. పచ్చని చెట్లతో నిండివున్న కొండలనడుమ బండరాళ్ళ మధ్య నుండి ప్రవహిస్తున్న సెలయేరు ఒకవైపు. ఈ ప్రాంతానికి వచ్చినవారు సాయంత్రం వరకు గడపడానికి విశాలంగా వున్న నీటి తోటలు, మరోవైపు చూపరులను ఆకట్టుకునే విధంగా ఉంటాయి. మన్యంలో తెల్లదొరలపై విప్లవం చేసిన అల్లూరి సీతారామరాజు ఎక్కువగా ఇక్కడ గడి పేవారని పెద్దలు చెపుతుంటారు. ప్రాధాన్యత కలిగిన పవిత్ర దినాల్లోను కార్తీక మాసంలోను, ఈ ప్రాంతం అంతా శివపూజలు చేసే భక్తులు, వనభోజనాలకు వచ్చే సందర్శకులతో సందడిగా ఉంటుంది. సందర్శకుల సౌకర్యార్థం స్నానపు గదులు, మహిళలు దుస్తులు మార్చుకునేందుకు గది, విశ్రాంతి తీసుకోవడానికి షెడును టూరిజం శాఖవారు ఏర్పాటు చేయడం జరిగింది. భక్తులు పూజలు చేసుకోవడానికి, సందర్శకులు ఆహ్లాదంగా గడపడానికి అన్ని వసతులు ఇక్కడ వుండటంతో కార్తీకమాసం సీజనంతా దూరప్రాంతాల నుంచి వందల సంఖ్యలో సందర్శకులు ఇక్కడకు వస్తుంటారు. అలాగే శివరాత్రికి మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు ఇక్కడకు వచ్చి ధారమల్లేశ్వరునికి ప్రత్యేక పూజలు చేస్తారు.



దారమట్టం శివాలయం

మండలకేంద్రం గోలుగొండ నుంచి 5 కిలోమీటర్లు దూరం ప్రయాణించేస్తే ఈ ప్రాంతానికి చేరుకోవచ్చు. గొలుగొండ నుంచి తారురోడ్డు ఉండడంతో ఇక్కడకు చేరుకోవడానికి అన్నిరకాల వాహనాలు అందుబాటులో వుంటాయి.

అల్లూరి పార్క్ ప్రత్యేకం:

మండలంలో కేడీపేట గ్రామంలో ఉన్న అల్లూరి సమాధుల ప్రాంతం అల్లూరు పార్కుగా అభివృద్ధి చెంది విహారయాత్రకు అనుకూలంగా ఉంటుంది. ఒక్క విహారయాత్రకే కాకుండా అల్లూరి పార్క్ వస్తే విజ్ఞాన యాత్ర కూడా పూర్తవుతుంది. అల్లూరి పార్కులో విహారయాత్రకు అనువుగా ఆహ్లాద కరమైన పార్కు ప్రాంతం. సందర్శకులు వేచి ఉండడానికి షెడ్లు, కూర్చోవడానికి గ్రానైట్ బల్లలు అనుకూలంగా ఉంటాయి. మన్యం విప్లవానికి సంబంధించిన అంశాలకు చెందిన సుమారు 16 శిలాఫలకాలు పార్కు గోడలపై అంటించి ఉన్నాయి. దీంతో మన్యం విప్లవం జరిగిన రెండు సంవత్సరాల కాలంలో అల్లూరి సీతారామరాజు మన్యం వీరులు తో కలిసి చేపట్టిన ముఖ్యమైన కార్యక్రమాలు ఈ శిలాఫలకాలపై ఉన్నాయి. అంతేకాక ఆయన చరిత్రను తెలియజేయడానికి డాక్యుమెంటరీ ఫిల్మ్ ప్రదర్శించడానికి మినీ థియేటర్ కూడా పార్క్‌లో ఉంది. అలాగే పార్క్ ఆనుకుని దిగువ భాగంలో పెద్ద సెలయేరు నిత్యం ప్రవహిస్తూ ఉంటుంది.. వీటన్నింటిలో అల్లూరి పార్క్ వస్తే సందర్శకులకు విహారంతో పాటుగా విజ్ఞానయాత్ర కూడా జరిగినట్టు అవుతుంది. అలాగే ఇక్కడికి సమీపంలో ఉన్న వల్సంపేట జలపాతం కూడా విహార యాత్రలకు అనువుగా ఉంటుంది. అలాగే కేడిపేటకు సమీపంలోని వల్సంపేట జలాపాతంకు వచ్చేందుకు పర్యాటకులు ఆసక్తి చూపుతారు. ఈ జలపాతం పర్యాటకులను ఎంతగానే ఆకర్షిస్తోంది.

అల్లూరి సమాధి

సేదతీరేందుకు ఏర్పాటు చేసిన నిర్మాణాలు

అదుపులో నలుగురు నిందితులు

దళిత యువకుని హత్యాయత్నం కేసులో కొనసాగుతున్న విచారణ

ప్రజాశక్తి -కొత్తకోట:కొత్తకోట పోలీస్ స్టేషన్ పరిధి మర్రివలస గ్రామానికి చెందిన దళిత యువకుడు వారా కన్నయ్య (నాయుడు)పై హత్యాయత్నం కేసులో ప్రమేయం ఉన్న నలుగురిని అదుపులోకి తీసుకున్నామని అనకాపల్లి డిఎస్పి సుబ్బరాజు తెలిపారు. ఆదివారం సాయంత్రం కొత్తకోట సర్కిల్ కార్యాలయంలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మర్రి వలస గ్రామంలో ఈ నెల 16న సుమారు 9 గంటల సమయంలో ఇదే గ్రామానికి చెందిన తమ్మిరెడ్డి వంశీకృష్ణ, వారా కన్నయ్యల సెల్ ఫోన్ చోరీ విషయమై తగదా పడ్డారన్నారు. ఈ తగాదాలో వంశీ కృష్ణ అప్పటికే కత్తిని సిద్ధం గా ఉంచడంతో పాటు మరో ముగ్గురు ఎలిసెట్టి రాముడు, ఎలిసెట్టి వరాల బాబు, ఊసి మహేష్ లను కూడా సిద్ధం చేసాడని, వీరంతా కలసి కన్నయ్య పై దాడి చేశారన్నారు. ఈ దాడిలో కన్నయ్య కు తీవ్ర గాయాలు కాగా నిందితులు అక్కడి నుంచి పరారయ్యారన్నారు. సమాచారం తెలుసుకున్న కొత్తకోట ఎస్సై లక్ష్మణ రావు సంఘటనా స్థలానికి చేరుకొని స్థానిక ఆటో డ్రైవర్ సహకారంతో నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారన్నారు.కన్నయ్య సోదరుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసారని డిఎస్పి పేర్కొన్నారు. నిందితులపై హత్య నేరంతో పాటు ఎస్సి ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశామని చెప్పారు. బాధితుని కుటుంబానికి రక్షణ కల్పించడంతో పాటు గ్రామంలో ఎటువంటి అలజడలు చోటు చేసుకోకుండా పోలీస్ పికెట్ ఏర్పాటు చేశామని డిఎస్పి సుబ్బరాజు తెలిపారు. ఈ సమావేశంలో సిఐ సయ్యద్ ఇలియాస్ మహ్మద్, ఎస్ఐ లక్ష్మణరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఎస్‌పి సుబ్బరాజు

ఆలయాల నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి- యస్.రాయవరం:మండలంలో పెట్టుగొల్లపల్లి గ్రామంలో మరిడిమాంబ అమ్మవారి ఆలయ నూతన నిర్మాణానికి రిటైర్డ్ టీచర్ అల్లు అప్పలరాజు వరలక్ష్మి దంపతులు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అల్లు నరసింహమూర్తి, మాజీ సర్పంచ్ అల్లు గంగరాజు, అల్లు కాసులు పాల్గొన్నారు.

గొలుగొండ:మండలంలోని జోగుంపేట గ్రామ పంచాయతీలో తిరుపతి దేవస్థానం నిధులతో నిర్మించనున్న మరిడిమహాలక్ష్మీ అమ్మవారి గుడి నిర్మాణ పనులను ఆదివారం సర్పంచ్ జువ్వల లక్ష్మీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ లాలం స్వామి నాయుడు, మాజీ సర్పంచ్ చిటికెల వరహాలబాబు, నర్సీపట్నం డివిజన్ ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ నెంబరు చిట్ల చలపతిరావు , మాజీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు జువ్వల దేవుడు, పంచాడ నాగరాజు పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

మాట్లాడుతున్న ఎస్ఐ ఉపేంద్ర

చోరీలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-గొలుగొండ: చోరీలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కేడిపేట ఎస్సై ఉపేంద్ర కోరారు. మండలంలోని ఏఎల్ పురం గ్రామంలో ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, గ్రామాల్లో ఎవరైనా అనుమానితులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. బ్యాంకు నుంచి విత్ డ్రా చేసిన అమౌంట్ ఇంటికి తెచ్చే వరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా డబ్బును దొంగిలించే అవకాశం ఉందన్నారు. ఏటీఎం పిన్ ఎవరికి చెప్పకూడదన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.